STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 336 | ఎడిటర్ : అలీ ముర్తుజా | బుధవారం 4 నవంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |

సైబర్ నేరాలపై పోరాటం ఉద్ధృతం!



- హైదరాబాద్‌లో జాతీయ స్థాయి సైబర్ నేరాల సమన్వయ సదస్సు
- తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో కీలక చర్చలు
- మోసపోయిన సొమ్ము రికవరీతోనే సరిపెట్టొద్దు.. నేరాల మూలాలను ఛేదించాలి

3

హైదరాబాద్‌లో భారీ ఫేక్ కరెన్సీ రాకెట్

- రూ.6.78 కోట్ల నకిలీ నోట్ల పట్టివేత
- హైదరాబాద్ శివార్లలో భారీ నకిలీ కరెన్సీ ముఠా అరెస్ట్
- రూ.6.78 కోట్ల విలువైన రూ.500 నకిలీ నోట్లు స్వాధీనం



2

సింగరేణి మాజీ కార్మికులకు మరో అవకాశం!

- గైర్హాజరుతో ఉద్యోగాలు కోల్పోయిన వారికి ఊరట
- హైపవర్ కమిటీ ఏర్పాటుకు యాజమాన్యం ఉత్తర్వులు
- 46 ఏళ్లలోపు వారికి చాన్స్.. వైద్య పరీక్షల్లో అర్హత తప్పనిసరి
- దరఖాస్తులకు నవంబర్ 14 చివరి గడువు



సింగరేణి సంస్థలో గైర్హాజరు కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన మాజీ కార్మికులకు యాజమాన్యం శుభవార్త అందించింది. కుటుంబ, వ్యక్తిగత కారణాలతో విధులకు హాజరుకాలేక ఉద్యోగాల నుంచి తొలగింపునకు గురైన వారికి తిరిగి ఉద్యోగంలో చేరేందుకు మరో అవకాశం కల్పించాలని నిర్ణయించింది. 2023 జనవరి 1 నుంచి 2025 డిసెంబర్ 31 మధ్య గైర్హాజరు కారణంగా తొలగించిన కార్మికుల కేసులను పునఃపరిశీలించేందుకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది.

2

నేపాల్‌లో రెండు హెలికాప్టర్లు ఢీ

భారతీయుడి మృతి!

- ల్యాండింగ్ సమయంలో ఒకదానికొకటి తగిలిన రోటర్లు
- సోలుఖుంబు ప్రాంతంలోని ఫెరిచే హెలిప్యాడ్ వద్ద ప్రమాదం

4



తుమ్మిడిహెట్టిపై మహారాష్ట్రతో చర్చలు కొనసాగించండి!

నీటిపారుదల శాఖ అధికారులకు సీఎం కీలక ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్ 3 (సమయం న్యూస్): తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా బ్యారేజీ ఎత్తు పెంపుతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూముల వివరాలు, పరిహారం, సాంకేతిక అంశాలపై పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాలు, గతంలో జరిగిన చర్చలు, ఇతర సంబంధిత పత్రాలను మహారాష్ట్ర ప్రభుత్వానికి అందజేయాలని స్పష్టం చేశారు. ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు తగిన పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. ఇందుకోసం అవసరమైన నిధులను రెండు రాష్ట్రాల సంయుక్త ఖాతాలో ఉంచేందుకు కూడా అభ్యంతరం లేదని తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో నీటిపారుదల శాఖ మంత్రి

వివరాలు 2 లో

- ముంపు భూములకు పరిహారం చెల్లించేందుకు సిద్ధమని స్పష్టీకరణ
- సంయుక్త ఖాతాలో నిధుల జమకు సైతం తెలంగాణ సుముఖం
- బ్యారేజీ ఎత్తు 152 మీటర్లకు పెంచే ప్రతిపాదనపై ప్రత్యేక దృష్టి
- మహారాష్ట్ర చేపట్టే ముంపు సర్వేకు అభ్యంతరం లేదన్న ముఖ్యమంత్రి
- ఆదిలాబాద్ సాగునీటి అవసరాలే ప్రధాన లక్ష్యంగా ముందడుగు



రాహుల్‌పై బీజేపీ విమర్శలు

- 'జుగుప్సాకరమైన వ్యక్తి' అంటూ మండిపడ్డ సీఆర్ కేశవన్
- విదేశీ సాయంతోనే మోదీ అధికారంలో ఉన్నారన్న ఆరోపణలపై ఆగ్రహం
- దేశ అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యాన్ని కోరింది రాహులేనని విమర్శ

4

ఐఐటీ హైదరాబాద్ సత్తా!

- 251వ స్థానానికి చేరుకున్న ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ
- గత ఏడాదితో పోలిస్తే 19 స్థానాలు మెరుగుదల
- ఆవిష్కరణలు, అధ్యాపకుల ప్రతిభలో ముందంజ
- ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 588వ స్థానం.. ఇంజినీరింగ్‌లోనూ పురోగతి
- 850కి పైగా పేటెంట్లు.. 300కు పైగా అంకుర సంస్థలు
- సమష్టి కృషికి దక్కిన గుర్తింపన్న సంచాలకుడు ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి

2



నార్కట్‌పల్లిలో భారీ పేలుడు



నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి మండలంలో మంగళవారం భారీ పేలుడు ప్రమాదం సంభవించి తీవ్ర కలకలం రేపింది. మండలం పరిధిలోని గోపులయిపల్లి గ్రామంలో ఉన్న గణేష్ ఆనంద్ ఎక్స్‌క్లూజివ్స్ పరిశ్రమ విభాగంలో అకస్మాత్తుగా భారీ బ్లాస్టింగ్ చోటుచేసుకుంది.

2

బీజేపీవి పగటి కలలే!

- అమిత్ షా వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజం
- ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపణ
- కాళేశ్వరం అవినీతిపై కేంద్రం చర్యలేవని నిలదీత
- 187 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ
- వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌దే అధికారమని ధీమా

3



నిరసన హక్కు ఉంది..

ఇతరుల హక్కులనూ గౌరవించాలి!

- ఆందోళనల పేరుతో బహిరంగ ప్రదేశాలను నిరవధికంగా ఆక్రమించలేరు
- ఢిల్లీ వ్యాపార సంఘాల పిటిషన్‌పై సుప్రీంకోర్టు
- నిరసన నిర్వాహకులను ప్రతివాదులుగా చేర్చాలని న్యాయస్థానం ఆదేశం

4





నిరసనకు నాయకత్వం వహించిన ఏసీపీ సస్పెండ్

బదిలీలను వ్యతిరేకిస్తూ పోలీసుల ఆందోళన

150 మంది సిబ్బందితో కలిసి నిరసన

న్యూఢిల్లీ, నవంబర్ 3 (సమయం న్యూస్): ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయం ఎదుట జరిగిన నిరసనకు నాయకత్వం వహించిన ఏసీపీ మనస్వి వశిష్ఠను అధికారులు సస్పెండ్ చేశారు. అక్టోబర్ 23న షాదరా పోలీస్ స్టేషన్‌లో న్యాయవాదులు, పోలీసుల మధ్య ఘర్షణ అనంతరం ఏసీపీ వశిష్ఠ, ఇన్‌స్పెక్టర్ అరుణ్ కుమార్‌లను బదిలీ చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ సోమవారం మహిళా అధికారులతో సహా సుమారు 150 మంది పోలీసులు ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి, ఇద్దరినీ పాత స్థానాల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. నిరసనకారులు పోలీసు కమిషనర్ అనురాగ్ కుమార్‌ను కలిసి ఐదు డిమాండ్లతో వినతిపత్రం ఇచ్చారు. షాదరా ఘటనలో ప్రమేయం ఉన్న న్యాయవాదులపై చర్యలు తీసుకోవాలని, దౌర్జన్యాలకు పాల్పడే వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని కోరారు. పోలీసుల మనోధైర్యం దెబ్బతినకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ నిరసనకు పిలుపు వాట్సాప్ గ్రూపుల ద్వారా వెళ్లినట్లు పీటీఐ తెలిపింది. షాదరా ఘటనలో న్యాయవాది లలిత్ బన్సల్ తలకు గాయాలు కావడంతో న్యాయవాదులు ఆందోళనకు దిగారు. పోలీసుల దురుసు ప్రవర్తనను నిరసిస్తూ జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్లు సమ్మెకు పిలుపునిచ్చాయి. ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్‌లపై రెండు నెలల్లో దర్యాప్తు చేస్తామని హామీ ఇవ్వడంతో న్యాయవాదులు సమ్మె విరమించారు

నార్కట్‌పల్లిలో భారీ పేలుడు

నలుగురికి తీవ్ర గాయాలు .. ముగ్గురి పరిస్థితి విషమం!



నల్లగొండ, నవంబర్ 3 (సమయం న్యూస్) : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో మంగళవారం భారీ పేలుడు ప్రమాదం సంభవించి తీవ్ర కలకలం రేపింది. మండలం పరిధిలోని గోపులయిపల్లి గ్రామంలో ఉన్న గణేష్ ఆనంద్ ఎక్స్‌క్లూజివ్స్ పరిశ్రమ విభాగంలో అకస్మాత్తుగా భారీ బ్లాస్టింగ్ చోటుచేసుకుంది. ఈ పేలుడు ధాటికి భవన భాగాలు, సిమెంట్ దిమ్మెలు చెల్లాచెదురుగా ఎగిరిపడ్డాయి. ఈ దారుణ ఘటనలో నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడగా, వారిలో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం అందుతోంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం వెంటనే హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. మరొక బాధితుడికి నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రి అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో ముగ్గురు ఒడిశా రాష్ట్రానికి చెందిన వలస కార్మికులు కాగా, మరొకరు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలానికి చెందిన స్థానిక వ్యక్తిగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఘటనకు సంబంధించిన సమాచారం అందుకున్న వెంటనే నార్కట్‌పల్లి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. భవన వ్యర్థాల కింద ఎవరైనా చిక్కుకున్నారేమోనని గాలింపు జరిపారు. అసలు ప్రమాదం సంభవించడానికి గల కారణాలేంటి, భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అనే అంశాలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని ముమ్మర విచారణ జరుపుతున్నారు.

హైదరాబాద్‌లో భారీ ఫేక్ కరెన్సీ రాకెట్

హైదరాబాద్, నవంబర్ 3 (సమయం న్యూస్): నగర శివార్లలో నకిలీ కరెన్సీ ముద్రించి, చలామణీ చేయడంతో పాటు దోపిడీలకు పాల్పడుతున్న ఓ భారీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఈ ఆపరేషన్‌లో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఏకంగా రూ.6.78 కోట్ల విలువైన నకిలీ రూ.500 నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రింటర్లు, ల్యాప్‌టాప్, ఇతర సామగ్రిని కూడా సీజ్ చేసినట్లు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి వెల్లడించారు. వివరాల్లోకి వెళితే, నవంబర్ 1వ తేదీన జాతీయ రహదారి-65పై రామోజీ ఫిల్మ్ సిటీ సమీపంలో ఒక కారులో నకిలీ నోట్లను విజయవాడకు తరలిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు, షాద్‌నగర్ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్ఓటీ) సంయుక్తంగా వాహనాన్ని అడ్డగించి తనిఖీ చేశారు. కారులో ఉన్న ఎం. కరుణాకర్, సిహెచ్. మాణిక్య రెడ్డి, సిహెచ్. రత్నాకర్ రెడ్డి, కె. అజయ్ కుమార్‌లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.8 లక్షల నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా, కుంట్లూర్‌లోని ఓ అద్దె ఇంట్లో నకిలీ కరెన్సీ ప్రింటింగ్ యూనిట్‌ను నడుపుతున్నట్లు అంగీకరించారు. దీంతో పోలీసులు వెంటనే ఆ ఇంటిపై దాడి చేసి, భారీ మొత్తంలో నకిలీ నోట్ల కట్టలు, ప్రింటర్లు, ల్యాప్‌టాప్, కరెన్సీ కటింగ్ మెషీన్‌లను సీజ్ చేశారు. ఈ ముఠా కేవలం నకిలీ నోట్లను ముద్రించడమే కాకుండా, వినూత్న పద్ధతిలో దోపిడీలకు పాల్పడేదని పోలీసులు తెలిపారు. తక్కువ ధరకు నకిలీ కరెన్సీ ఇస్తామని, అసలు డబ్బు ఇస్తే మూడు, నాలుగు రెట్లు నకిలీ నోట్లు ఇస్తామని ఆశ చూపి కస్టమర్లను ఆకర్షించేవారు. వారు అసలు డబ్బుతో వచ్చినప్పుడు, ముఠాలోని ఇతర సభ్యులు నకిలీ పోలీస్ ఐడీ కార్డులు, వాకీ-టాకీలు, డమ్మీ పిస్టల్‌తో పోలీసుల వేషంలో అక్కడికి వచ్చేవారు. నకిలీ నోట్ల దందా చేస్తున్నారంటూ కస్టమర్లను బెదిరించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించేవారు. దీంతో భయపడిన బాధితులు తమ వెంట తెచ్చుకున్న అసలు డబ్బును అక్కడే వదిలి పారిపోయేవారు. ఈ విధంగా ఇద్దరు కస్టమర్ల నుంచి రూ.2 లక్షలు, రూ.3 లక్షలు దోచుకున్నట్లు విచారణలో తేలింది. ప్రధాన నిందితుడు కరుణాకర్, యూట్యూబ్ వీడియోలు చూసి అసలు రూ.500 నోటును స్కాన్ చేసి, ఫోటోషాప్‌లో ఎడిట్ చేసి నకిలీ నోట్లను ఎలా ప్రింట్ చేయాలో నేర్చుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అరెస్ట్ చేసిన నలుగురు నిందితులను కోర్టులో హాజరుపరచగా, వారికి జ్యుడీషియల్ కస్టడీ విధించారు.

తుమ్మిడిహెట్టిపై మహారాష్ట్రతో చర్చలు కొనసాగించండి!

మొదటి పేజీ తరువాయి

ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి తుమ్మిడిహెట్టి బ్యారేజీ అంశంపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇటీవల ముంబైలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో జరిపిన చర్చల వివరాలను అధికారులతో పంచుకున్నారు. ఆ సమావేశంలో ప్రస్తావనకు వచ్చిన అంశాలపై తదుపరి చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్ర భూభాగంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలపై ఆ రాష్ట్ర ప్రభుత్వం సర్వే నిర్వహించేందుకు తెలంగాణకు ఎలాంటి అభ్యంతరం లేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహారాష్ట్ర అధికారులు కోరే వివరాలను ఎప్పటికప్పుడు అందించాలని సూచించారు. ముంపు ప్రభావం, భూసేకరణ, పరిహారం వంటి అంశాల్లో పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే కుదిరిన ఒప్పందాల ఆధారంగా రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇటీవల ముంబైలో జరిగిన సమావేశంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 152 మీటర్లకు పెంచాలని తెలంగాణ ప్రభుత్వం మహారాష్ట్రను కోరింది. 2016లో కుదిరిన ఒప్పందం ప్రకారం బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయించినప్పటికీ, ఆ ఎత్తుతో నిర్మిస్తే తెలంగాణ సాగు, తాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. విద్యుత్ వినియోగం, నిర్వహణ వ్యయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ



మార్పులను పరిగణనలోకి తీసుకుంటే సాధ్యమైనంతవరకు గురుత్వాకర్షణ ఆధారంగా నీటిని తరలించే విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ నేపథ్యంలో 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణం ప్రయోజనకరమని మహారాష్ట్ర ప్రభుత్వానికి వివరించినట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సాగునీటి అవసరాలను తీర్చేందుకు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎంతో కీలకమని తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎస్.బి.చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి ఇప్పటివరకు అనేక దశల్లో చర్చలు జరిగినప్పటికీ ఆశించిన పురోగతి సాధించలేకపోయామని గుర్తుచేసింది. సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిలో వెనుకబడిందని వివరించింది. ముఖ్యంగా గిరిజనులు, ఆదివాసీల సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించినట్లు తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. అయితే బ్యారేజీ ఎత్తు పెంపుపై తుది నిర్ణయం తీసుకునే ముందు సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సి ఉందని ఫడ్నవీస్ పేర్కొన్నట్లు తెలిపింది. మహారాష్ట్ర ప్రజలకు, ఆ రాష్ట్ర ప్రయోజనాలకు ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తుకు సంబంధించిన గత ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు అభ్యంతరం లేదని ఆయన చెప్పినట్లు వెల్లడించింది. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం మహారాష్ట్రతో ఉన్న పెండింగ్ అంశాలను పరిష్కరించుకోవడంపై దృష్టి సారించింది. ముంపు భూములకు పరిహారం, బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, సాంకేతిక అనుమతులపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరడం కీలకం కానుంది. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు ఇచ్చిన ఆదేశాలతో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు చర్చలు మరింత ముందుకు సాగే అవకాశముంది. అయితే బ్యారేజీ ఎత్తు పెంపుపై మహారాష్ట్ర తుది అంగీకారం ఇంకా రావాల్సి ఉంది.

సింగరేణి మాజీ కార్మికులకు మరో అవకాశం!

- గైర్హాజరుతో ఉద్యోగాలు కోల్పోయిన వారికి ఊరట
- 2023 నుంచి 2025 మధ్య తొలగించిన ఉద్యోగుల కేసుల పునఃపరిశీలన
- హైపవర్ కమిటీ ఏర్పాటుకు యాజమాన్యం ఉత్తర్వులు
- 46 ఏళ్లలోపు వారికి అవకాశం.. వైద్య పరీక్షల్లో అర్హత తప్పనిసరి
- దరఖాస్తులకు నవంబర్ 14 చివరి గడువు

కొత్తగూడెం, నవంబర్ 3 (సమయం న్యూస్): సింగరేణి సంస్థలో గైర్హాజరు కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన మాజీ కార్మికులకు యాజమాన్యం శుభవార్త అందించింది. కుటుంబ, వ్యక్తిగత కారణాలతో విధులకు హాజరుకాలేక ఉద్యోగాల నుంచి తొలగింపునకు గురైన వారికి తిరిగి ఉద్యోగంలో చేరేందుకు మరో అవకాశం కల్పించాలని నిర్ణయించింది. 2023 జనవరి 1 నుంచి 2025 డిసెంబర్ 31 మధ్య గైర్హాజరు కారణంగా తొలగించిన కార్మికుల కేసులను పునఃపరిశీలించేందుకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అర్హత కలిగిన మాజీ ఉద్యోగులు నవంబర్ 14లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో డిస్మిస్



అయిన సింగరేణి కార్మికుల సమస్య ప్రస్తావనకు వచ్చింది. వివిధ కారణాలతో ఉద్యోగాలు కోల్పోయిన వారికి మరో అవకాశం కల్పించాలని ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి అర్హులైన మాజీ కార్మికుల పునర్నియామక అవకాశాలను పరిశీలించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. సింగరేణి యాజమాన్యం ప్రకటించిన నిబంధనల ప్రకారం 2023 జనవరి 1 నుంచి 2025 డిసెంబర్ 31 మధ్య గైర్హాజరు కారణంగా ఉద్యోగం నుంచి తొలగించబడిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. 2026 ఏప్రిల్ 1 నాటికి అభ్యర్థి వయస్సు 46 సంవత్సరాలు మించకూడదు. ఉద్యోగం నుంచి తొలగింపునకు ముందు ఐదు క్యాలెండర్ సంవత్సరాల్లో ఏవైనా రెండు సంవత్సరాల్లో కనీసం 100 మస్టర్లు పూర్తి చేసి ఉండాలి. జనరల్ అసిస్టెంట్ ట్రైనీ (భూగర్భం), కేటగిరీ-1 పోస్టులో పనిచేసేందుకు వైద్యపరంగా అర్హత సాధించడం తప్పనిసరి. అర్హులైన మాజీ కార్మికులు నిర్దిష్ట నమూనాలో దరఖాస్తులను పూర్తి చేసి తాము చివరిగా పనిచేసిన గని లేదా శాఖ అధిపతికి సమర్పించాలి. దరఖాస్తుల స్వీకరణకు నవంబర్ 14ను చివరి తేదీగా నిర్ణయించారు. సంబంధిత ఏరియా జనరల్ మేనేజర్లు దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు పంపించనున్నారు. హైపవర్ కమిటీ పరిశీలన, నిర్దేశిత అర్హతలు, వైద్య పరీక్షల ఆధారంగానే పునర్నియామకంపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఉద్యోగాలు కోల్పోయి తిరిగి విధుల్లో చేరేందుకు ఎదురుచూస్తున్న మాజీ కార్మికులకు తాజా నిర్ణయం ఊరట కలిగించనుంది. అయితే దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగం లభిస్తుందని కాకుండా, నిబంధనల ప్రకారం అర్హత సాధించిన వారి కేసులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని యాజమాన్యం స్పష్టం చేసింది. పూర్తి వివరాల కోసం సంబంధిత గని లేదా శాఖ అధికారులను సంప్రదించాలని సూచించింది.

ఆసియా ర్యాంకింగ్స్‌లో ఐఐటీ హైదరాబాద్ సత్తా!

- 251వ స్థానానికి చేరుకున్న ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ
- గత ఏడాదితో పోలిస్తే 19 స్థానాలు మెరుగుదల
- పరిశోధనలు, ఆవిష్కరణలు, అధ్యాపకుల ప్రతిభలో ముందంజ
- ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 588వ స్థానం.. ఇంజినీరింగ్‌లోనూ పురోగతి
- 850కి పైగా పేటెంట్లు.. 300కు పైగా అంకుర సంస్థలు
- సమష్టి కృషికి దక్కిన గుర్తింపన్న సంచాలకుడు ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి



హైదరాబాద్, నవంబర్ 3 (సమయం న్యూస్): అంతర్జాతీయ విద్యా ప్రమాణాలు, పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణల్లో భారతీయ సాంకేతిక విద్యాసంస్థ హైదరాబాద్ (ఐఐటీ హైదరాబాద్) మరో ముందడుగు వేసింది. ప్రతిష్ఠాత్మక క్యూఎస్ ఆసియా విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్స్-2027లో 251వ స్థానాన్ని సాధించింది. గత ఏడాది 270వ స్థానంలో ఉన్న సంస్థ ఈసారి ఏకంగా 19 స్థానాలు మెరుగుపరుచుకోవడం విశేషం. విద్యా ప్రమాణాలు, పరిశోధనా ఉత్పాదకత, అధ్యాపకుల అర్హతలు, విద్యావేత్తలు, ఉద్యోగ అవకాశాలు కల్పించే సంస్థల్లో ప్రతిష్ఠ వంటి అంశాల్లో మెరుగైన పనితీరు కనబరచడం ఈ పురోగతికి దోహదపడింది. ఆసియాలో ఐఐటీ హైదరాబాద్ అధిగమించిన విద్యాసంస్థల శాతం 82.5 నుంచి 85.5కు పెరగడం సంస్థ సాధించిన అభివృద్ధికి నిదర్శనంగా నిలిచింది. సాంకేతికత ఆధారిత విద్యతోపాటు అత్యాధునిక పరిశోధనలు, ఆవిష్కరణలకు ఐఐటీ హైదరాబాద్ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. అధ్యాపకులు, విద్యార్థులు రూపొందించే వినూత్న ఆలోచనలను మేధో సంపత్తిగా మార్చడంతోపాటు సమాజానికి ఉపయోగపడే పరిష్కారాలను అభివృద్ధి చేసేందుకు ప్రోత్సహిస్తోంది. వివిధ విభాగాల సమన్వయంతో చేపట్టే పరిశోధనలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో చేస్తున్న కృషి సంస్థ ప్రతిష్ఠను పెంచుతున్నాయి. క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో విద్యా ప్రతిష్ఠ, ఉద్యోగదాతల అభిప్రాయాలు, పరిశోధనల ప్రభావం, అధ్యాపక వనరులు, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. క్యూఎస్ ప్రపంచ విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్స్-2027లో ఐఐటీ హైదరాబాద్ 588వ స్థానంలో నిలిచింది. అదేవిధంగా 2026లో విడుదలైన సబ్జెక్టులవారీ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఇంజినీరింగ్, సాంకేతిక విభాగంలో 395వ ర్యాంకును సాధించింది. అంతకుముందు 501-550 స్థానాల శ్రేణిలో ఉన్న సంస్థ గణనీయమైన పురోగతిని నమోదు చేసింది. జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ వ్యవస్థ-2025 ప్రకారం దేశంలోని ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో ఏడో స్థానాన్ని, ఆవిష్కరణల విభాగంలో ఆరో స్థానాన్ని దక్కించుకుంది. జాతీయ ర్యాంకింగ్స్ ప్రారంభమైనప్పటి నుంచి దేశంలోని అత్యుత్తమ పది ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో తన స్థానాన్ని కొనసాగిస్తోంది. 2008లో స్థాపించబడిన ఐఐటీ హైదరాబాద్ కేవలం 18 సంవత్సరాల్లోనే పరిశోధన, సాంకేతిక అభివృద్ధి రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించింది. ఇప్పటివరకు రూ.1,880 కోట్లకు పైగా విలువైన 5,980కిపైగా పరిశోధన, అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే రూ.245 కోట్లకు పైగా పరిశోధనా నిధులను సమీకరించింది. సంస్థ నుంచి 14,580కిపైగా పరిశోధనా ప్రచురణలు వెలువడగా, వాటికి 3.04 లక్షలకు పైగా ఉల్లేఖనలు నమోదయ్యాయి. ఇప్పటివరకు 850కిపైగా పేటెంట్ దరఖాస్తులు ఉండగా, వాటిలో 450కిపైగా పేటెంట్లు మంజూరయ్యాయి. సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం 2025లోనే 250 పేటెంట్లు సాధించడం విశేషం. ఐఐటీ హైదరాబాద్ ప్రోత్సాహంతో 300కిపైగా అంకుర సంస్థలు ఏర్పడి 1,100కిపైగా ఉద్యోగ అవకాశాలను సృష్టించాయి. ఈ సంస్థలు రూ.1,500 కోట్లకు పైగా ఆదాయాన్ని ఆర్జించినట్లు వెల్లడించింది. స్టాన్‌ఫోర్డ్, ఎల్సెవియర్ విడుదల చేసిన 2026 ప్రపంచ అత్యుత్తమ రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాలో ఐఐటీ హైదరాబాద్ అధ్యాపకులు చోటు సంపాదించారు. కెరీర్ ఆధారిత జాబితాలో 17 మంది, ఒక సంవత్సరపు పరిశోధనా పనితీరు ఆధారిత జాబితాలో 23 మంది అధ్యాపకులు స్థానం పొందారు. ప్రస్తుతం సంస్థలో 355 మందికి పైగా పూర్తిస్థాయి అధ్యాపకులు, 350 మందికి పైగా బోధనేతర సిబ్బంది, 6,110 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. వీరిలో సుమారు 60 శాతం మంది పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు కావడం పరిశోధనలకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. ఈ సందర్భంగా ఐఐటీ హైదరాబాద్ సంచాలకుడు ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి మాట్లాడుతూ ఆసియా ర్యాంకింగ్స్‌లో సాధించిన పురోగతి అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు, సిబ్బంది నిరంతర కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్య, పరిశోధనల్లో బలమైన పునాదులను సాంకేతిక ఆవిష్కరణలు, వాస్తవ ప్రపంచ సమస్యల పరిష్కారాలతో అనుసంధానిస్తున్నామని తెలిపారు. వినూత్న ఆలోచనలను సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలుగా మార్చేలా ప్రోత్సహిస్తున్నామని వివరించారు. తదుపరి తరం టెలికమ్యూనికేషన్లు, కృత్రిమ మేధ, రోబోటిక్స్, సెమీకండక్టర్లు, క్వాంటం సాంకేతికత, ఆరోగ్య సంరక్షణ, విద్యుత్ వాహనాలు, సుస్థిర అభివృద్ధి వంటి రంగాల్లో పరిశోధనలను మరింత విస్తరిస్తున్నట్లు పేర్కొన్నారు. మానవాళి సంక్షేమం కోసం సాంకేతిక ఆవిష్కరణలే లక్ష్యంగా ఐఐటీ హైదరాబాద్ ముందుకు సాగుతోందని తెలిపారు.

బీజేపీవి పగటి కలలే!



- అమిత్ షా వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజం
- ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపణ
- బీజేపీ, బీఆర్ఎస్ దొందూ దొందేనని తీవ్ర విమర్శలు
- కాళేశ్వరం అవినీతిపై కేంద్రం చర్యలేవని నిలదీత
- 187 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ
- వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌దే అధికారమని ధీమా

దమ్మాయిగూడెం, నవంబర్ 3 (సమయం న్యూస్): తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోపాటు బీజేపీ అగ్రనేతలు పగటి కలలు కంటున్నారని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. తెలంగాణ ప్రజలు బీజేపీని నమ్మే పరిస్థితిలో లేరని, ఆ పార్టీ ఎన్ని ప్రయత్నాలు చేసినా రాష్ట్రంలో అధికారంలోకి రావడం సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. మంగళవారం దమ్మాయిగూడెం గ్రామంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 187 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతోపాటు రాష్ట్రంలోని బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని తనకు అనుకూలంగా ఉపయోగించుకుంటోందని పొంగులేటి ఆరోపించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించిందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఓటు హక్కును పరిరక్షించాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఓటర్ల హక్కులకు భంగం కలిగించే చర్యలను ప్రజలు అంగీకరించబోరని అన్నారు. అయితే 13 కోట్ల ఓట్లు తొలగించారన్నది మంత్రి చేసిన రాజకీయ ఆరోపణ మాత్రమే; దానికి సంబంధించిన స్వతంత్ర ధ్రువీకరణ వెల్లడికాలేదు. తెలంగాణ నుంచి ఢిల్లీకి 'ఆర్ఆర్ టాక్స్' వెళ్తోందంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన విమర్శలను పొంగులేటి ఖండించారు. ఆధారాలు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తెలంగాణలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాజకీయంగా ఎదుర్కోలేకనే బీజేపీ నేతలు ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపణలు వచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని మంత్రి ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై ఆధారాలతో ఫిర్యాదులు చేసినా కేంద్రం స్పందించలేదని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య రాజకీయ అవగాహన ఉందని ఆరోపిస్తూ రెండు పార్టీలు ప్రజలను మభ్యపెడుతున్నాయని అన్నారు. ఒకరు కొట్టినట్లు, మరొకరు ఏడ్చినట్లు నటిస్తూ రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నాయని ఎద్దేవా చేశారు. రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తుందని పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణలో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని దేశవ్యాప్తంగా విస్తరిస్తామని ప్రకటించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రామసహాయం నరేష్ రెడ్డి, పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొప్పుల అశోక్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై పోరాటం మరింత ఉద్ధృతం!

- హైదరాబాద్‌లో జాతీయ స్థాయి సైబర్ నేరాల సమన్వయ సదస్సు
- తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో కీలక చర్చలు
- మోసపోయిన సొమ్ము రికవరీతోనే సరిపెట్టొద్దు.. నేరాల మూలాలను ఛేదించాలి
- ఆరు కీలక రంగాల్లో తెలంగాణ నుంచి 52 సిఫార్సులు
- సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణకు దేశంలోనే అగ్రస్థానమని వెల్లడి
- కృత్రిమ మేధతో నేరాల గుర్తింపు.. రాష్ట్రాల మధ్య ఉమ్మడి కార్యాచరణకు ప్రాధాన్యం



హైదరాబాద్, నవంబర్ 3 (సమయం న్యూస్): దేశవ్యాప్తంగా పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సైబర్ భద్రతా విభాగం ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు. సైబర్ మోసాలకు గురైన బాధితులకు నగదు తిరిగి ఇప్పించడంతోనే బాధ్యత ముగిసిపోదని, అసలు మోసాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతోపాటు నేరాలకు సహకరిస్తున్న వ్యవస్థీకృత ముఠాలను పూర్తిస్థాయిలో ఛేదించడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సమీకృత ఆదేశ, నియంత్రణ కేంద్రం (టీజీఐసీసీసీ)లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో సంయుక్త సైబర్ నేరాల సమన్వయ బృందం నాలుగో ప్రాంతీయ విభాగం (జేసీసీటీ-4) సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ రాష్ట్రాల పోలీసు అధికారులు, జాతీయ దర్యాప్తు, భద్రతా సంస్థల ప్రతినిధులు పాల్గొని సైబర్ నేరాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. దేశవ్యాప్తంగా సైబర్ నేరాల నియంత్రణలో సమర్థవంతమైన సమన్వయం కోసం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఏడు ప్రాంతీయ జేసీసీటీలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన నాలుగో ప్రాంతీయ సదస్సుకు భారత సైబర్ నేరాల సమన్వయ కేంద్రం (ఐ4సీ) ముఖ్య కార్యనిర్వహణ అధికారి రాజేష్, ఆయన బృందం, జేసీసీటీ-4 పరిధిలోని రాష్ట్రాల పోలీసు అధికారులు హాజరయ్యారు. ప్రత్యేక ఆహ్వానం మేరకు మరో ఆరు రాష్ట్రాల ప్రతినిధులు, కీలక జాతీయ సంస్థల అధికారులు కూడా పాల్గొన్నారు. రాష్ట్రాల సరిహద్దులు దాటి విస్తరిస్తున్న సైబర్ నేరాలను ఎదుర్కోవాలంటే సమాచార మార్పిడి, సంయుక్త దర్యాప్తు, ఉమ్మడి కార్యాచరణ అత్యంత అవసరమని సమావేశంలో అభిప్రాయపడ్డారు. సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ సాధించిన పురోగతిని సదస్సులో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రధానమంత్రి కార్యాలయం ఇటీవల నిర్వహించిన సమీక్షల్లో సైబర్ నేరాల నియంత్రణకు సంబంధించిన పనితీరులో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచినట్లు సమావేశంలో వెల్లడించారు. బాధితుల ఫిర్యాదులపై వేగంగా స్పందించడం, మోసపూరిత లావాదేవీలను గుర్తించడం, నేరగాళ్లపై చర్యలు తీసుకోవడం వంటి అంశాల్లో తెలంగాణ అనుసరిస్తున్న విధానాలను వివరించారు. అయితే సైబర్ మోసాల నివారణలో మరింత ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు వసూలు చేస్తున్న నకిలీ డిజిటల్ అరెస్టు మోసాలపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. ఈ తరహా నేరాలపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు నేరాలకు పాల్పడుతున్న ముఠాల కార్యకలాపాలను అడ్డుకోవాలని సూచించారు. సైబర్ నేరాల వెనుక పనిచేస్తున్న ఆర్థిక లావాదేవీల వ్యవస్థలు, సమాచార సంబంధాలు, ఇతర సహాయక నెట్‌వర్క్‌లను గుర్తించి వాటిని ఛేదించే దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. సైబర్ భద్రతను పటిష్ఠం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన 52 సిఫార్సులను సదస్సులో వివరించారు. బ్యాంకింగ్, టెలికాం, భద్రత, కార్పొరేట్ బాధ్యత, డిజిటల్ మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ సహకారం అనే ఆరు కీలక రంగాలకు సంబంధించిన ఈ ప్రతిపాదనలను ఇటీవల కేంద్ర హోం శాఖ కార్యదర్శితో జరిగిన సమావేశంలోనూ చర్చించినట్లు తెలిపారు. సైబర్ నేరాలకు ఉపయోగపడుతున్న వ్యవస్థల్లో లోపాలను గుర్తించడం, సంబంధిత సంస్థల జవాబుదారీతనాన్ని పెంచడం, నేరాల నివారణకు సాంకేతిక వ్యవస్థలను బలోపేతం చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు.మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అంతర్జాల నేరాల నివారణ, కృత్రిమ మేధ ఆధారంగా సైబర్ నేరాలను గుర్తించడం, రాష్ట్రాల మధ్య సమాచార మార్పిడి, సంయుక్త దర్యాప్తు చర్యలు, సంస్థల జవాబుదారీతనం వంటి అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చించారు. సైబర్ నేరగాళ్లు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్న నేపథ్యంలో దర్యాప్తు సంస్థలు కూడా ఆధునిక పద్ధతులను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల పోలీసులు, కేంద్ర సంస్థలు సమన్వయంతో పనిచేస్తే నేరగాళ్లను వేగంగా గుర్తించి చర్యలు తీసుకునే అవకాశాలు మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు. సైబర్ నేరాలు ఒక రాష్ట్రానికో, ఒక ప్రాంతానికో పరిమితం కావడం లేదని, దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న మోసాలను ఎదుర్కొనేందుకు సమగ్ర వ్యూహం అవసరమని సమావేశంలో చర్చించారు. బాధితులకు సత్వర న్యాయం అందించడంతోపాటు నేరాలు జరగకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని నిర్ణయాత్మకంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని గుర్తించారు. హైదరాబాద్ వేదికగా జరిగిన ఈ సదస్సులోని చర్చలు దేశవ్యాప్తంగా సైబర్ నేరాల నియంత్రణకు మరింత సమన్వయంతో కూడిన ఉమ్మడి కార్యాచరణ రూపకల్పనకు దోహదపడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

నగరంలో వచ్చే మూడు రోజులు వానలు

వర్క్ ఫ్రం హోమ్ ఇవ్వాలని కంపెనీలకు పోలీసుల సూచన!

హైదరాబాద్, నవంబర్ 3 (సమయం న్యూస్) : నగరంలో రాబోయే మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఐటీ కంపెనీలు తమ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇచ్చే అవకాశాన్ని పరిశీలించాలని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగం కీలక సూచనలు చేసింది. నగరంలో మారుతున్న ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా, ఈ నెల 5వ తేదీ వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగం ఐటీ సంస్థలకు ప్రత్యేక అడ్వైజరీని విడుదల చేసింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని అన్ని ఐటీ కంపెనీలు, ఇతర కార్పొరేట్ సంస్థలు తమ ఉద్యోగుల



సురక్షతను దృష్టిలో ఉంచుకోవడంతో పాటు రోడ్లపై ట్రాఫిక్ స్తంభించకుండా, అత్యవసర సేవల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించింది. వర్ష ప్రభావం ఎక్కువగా ఉండే నవంబర్ 3వ తేదీ నుంచి నవంబర్ 5వ తేదీ వరకు సాధ్యమైనంత వరకు ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ వెసులుబాటు కల్పించడాన్ని ఒక ప్రత్యామ్నాయంగా పరిశీలించాలని స్పష్టం చేసింది. నగరంలో భారీ వర్షాల సమయంలో ఐటీ కారిడార్‌లోని ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి, అవసరమైన సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించడానికి వీలుగా ఐటీ కంపెనీలు తమ లాగిన్, లాగౌట్ ముందస్తు ప్రణాళికలను పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఇందుకు సంబంధించిన సమగ్ర వివరాలను ఎఎవితీవఎఏస్త్రఖిఅశ్రీ.ఎశీఏ కు ఇమెయిల్ ద్వారా పంపాలని సూచించారు. ముఖ్యంగా మధ్యాహ్నం, రాత్రి వేళల్లో వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉన్నందున, ఆఫీసులకు వచ్చే ఉద్యోగుల కోసం కంపెనీలు సాయంత్రం 4 గంటల లోపే లాగౌట్ ప్రక్రియను పూర్తి చేసి పంపించాలని సైబరాబాద్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.



రేవంత్ నిర్లక్ష్యంతోనే కరువు

గోదావరిలో నీళ్లున్నా చేలు ఎడారులు.. ఇది పాలకులు తెచ్చిన కరువు

కేసీఆర్‌పై అక్కసుతో కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులను పడావు పెట్టారు

గోదావరి జలాలను మళ్లిస్తేనే సదాశివుడికి నిజమైన నివాళి

హైదరాబాద్, నవంబర్ 3: రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడటానికి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తలాపున గోదావరి పారుతున్నా మన చేలు, చెలకలు ఎడారిగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్‌పై అక్కసుతో కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులను పడావు పెట్టి రైతులకు సాగునీరు అందకుండా చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. పాలకులు తెచ్చిన కరువు అని స్పష్టం చేశారు. ప్రముఖ కవి, గోదావరి గొంతుకగా నిలిచిన మల్లావరుల సదాశివుడు స్మారక పురస్కార ప్రదానోత్సవంలో కేటీఆర్ పాల్గొన్నారు. తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 2024-25 సంవత్సరానికి చెమన్ సింగ్, 2025-26 సంవత్సరానికి సంగిశెట్టి శ్రీనివాస్‌లకు స్మారక పురస్కారాలను అందజేశారు. సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో విశిష్ట సేవలందించిన తిరునగరి దేవకిదేవి, కవ్వంపల్లి స్వామిలను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రస్తుత కరువు పరిస్థితులు ప్రకృతి కారణంగా వచ్చినవి కావని, పాలకుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని, ఇదేదో తాను అక్కసుతోనో, కోపంతోనో చెబుతున్న మాట కాదు.. వాస్తవాలను ఆధారంగా చేసుకుని చెబుతున్న మాట అని పేర్కొన్నారు. ఈ ఏడాది ఏడున్నర నెలల్లో గోదావరిలోకి 750 టీఎంసీల నీళ్లు, కృష్ణా నదిలోకి 258 టీఎంసీల నీళ్లు వచ్చాయని, సుమారు వెయ్యి టీఎంసీల నీళ్లు సముద్రంలోకి వెళ్లిపోయాయని తెలిపారు. నీళ్లు ఎత్తండి.. రైతులను ఆదుకోండి అని తాము పాలకులను కోరాం.. కానీ వారు తమ విజ్ఞప్తిని పట్టించుకోకపోగా ఇవాళ వాస్తవాలను బుకాయించే ప్రయత్నం చేస్తున్నారు అని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్ష, పాలమూరు ప్రాజెక్టుపై పగ, కేసీఆర్‌పై అక్కసుతోనే వాటిని పడావు పెట్టారని ఆరోపించారు. గోదావరి జలాలను వినియోగించుకుని పొలాలకు సాగునీరు అందించాల్సిన అవసరం ఉందన్నారు. మల్లావరుల సాహిత్య సేవలను గుర్తు చేసుకుంటూ రవిగాంచని చోట కవిగాంచెను అని పెద్దలు ఎప్పుడో చెప్పారన్నారు. కష్టజీవికి ఇరువైపులా నిలబడ్డవాడే కవి.. గోదావరిఖని మట్టిలోనే ఏదో మహత్మ్యం ఉంది.. కన్నీటి చుక్కల నుంచే కత్తులు మొలిపించిన అద్భుత కవి మల్లావరుల అని కొనియాడారు. జలసాధన ఉద్యమ సమయంలో సదాశివుడు రాసిన 'తలాపున పారుతుంది గోదావరి' పాట ప్రజల్లో చైతన్యం నింపిందన్నారు. తెలంగాణ కోటి రతనాల వీణ అన్న మాటలో ఎంత శక్తి ఉందో ఈ పాటలోనూ అంతే లోతైన అర్థం ఉందని పేర్కొన్నారు. సదాశివుడు అజ్ఞాత సూర్యుడిగా తన పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఉద్యమ సమయంలో ప్రజల్లో స్ఫూర్తి నింపేందుకు కేసీఆర్ స్వయంగా పాట రాసిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. 2001లో మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభించినప్పుడు ఉద్యమంలో కొందరు నాయకులు మధ్యలోనే వెళ్లిపోయిన సందర్భంలో ప్రజల్లో నమ్మకం కల్పించేందుకు కేసీఆర్ పాట రాశారని వివరించారు. సిపాయిల తిరుగుబాటు విఫలమైందని అనుకుంటే వచ్చేదా దేశానికి స్వాతంత్ర్యం.. ఎన్నో పోరాటాల తర్వాతే విజయం సాధ్యమవుతుంది.. అలాగే తెలంగాణ రాష్ట్రం కూడా వచ్చి తీరుతుంది అనే నమ్మకాన్ని ఆ పాట ద్వారా కలిగించారని గుర్తు చేశారు. గోదావరి జలాలను పొలాలకు మళ్లించడమే మల్లావరులకు అర్పించే నిజమైన నివాళి అని కేటీఆర్ అన్నారు. రాష్ట్రం మళ్లీ దీపస్తంభంలా వెలుగొందాలని ఆకాంక్షించారు.

రైతులు అల్లాడుతుంటే దిల్లీలో నాటకాలా?

నిర్మల్ మహా పాదయాత్రలో రేవంత్‌పై బీజేపీ చీఫ్ రామచందర్ ఫైర్



నిర్మల్, నవంబర్ 3 : బీజేపీ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కేంద్రంలో మంగళవారం చేపట్టిన మహా పాదయాత్ర అశేష జనవాహిని మధ్య అత్యంత ఉత్సాహభరితంగా ప్రారంభమై విజయవంతంగా ముగిసింది. అనంతరం జరిగిన బహిరంగ సభలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు తన ప్రసంగంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో వ్యవసాయానికి సాగునీరు, విద్యుత్ అందక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోందని, అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్న దుస్థితిని కనీసం పట్టించుకోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిల్లీకి వెళ్లి వోట్ చోరీ అంటూ అసత్య ప్రచారాలు చేస్తూ రాజకీయ నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నట్లు అది వోట్ చోరీ కాదని, అసలు ఆయన బ్రెయినే చోరీ అయిందని, అటు గాంధీ పేరును దొంగిలించి రాహుల్ గాంధీ 'నామ్ చోరీ'కి పాల్పడ్డారని ఎద్దేవా చేశారు. ఈ ఇద్దరు దొంగలు కలిసి దేశాన్ని, రాష్ట్రాన్ని దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏకంగా రూ.12 లక్షల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసి అవినీతికి మారుపేరుగా నిలిచిందని రామచందర్ రావు గుర్తు చేశారు. కానీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఒక్క అవినీతి మచ్చ కూడా లేకుండా నీతివంతమైన, దేశ భక్తితో కూడిన స్వచ్ఛమైన పాలన అందిస్తోందని స్పష్టం చేశారు. అలాంటి మోదీ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తోందని, ఆ కుట్రలను అందరం కలిసికట్టుగా ప్రజాక్షేత్రంలో తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడి గ్రామగ్రామాన బీజేపీని మరింత పటిష్టం చేయాలని కోరారు. భవిష్యత్తులో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ మహా పాదయాత్రలో జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్, రాష్ట్ర సహ ఇన్‌చార్జి రేఖాశర్మ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, జి.నగేష్, ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, రాకేష్ రెడ్డి, పాయల్ శంకర్, పాల్వాయి హరీష్‌బాబు, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, పార్టీ ముఖ్య నేతలు, పార్టీ శ్రేణులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సంపాదకీయం



నడి సముద్రంలో భారత శౌర్యం..
భద్రతకు భరోసా!

సముద్ర దొంగల చెర నుంచి ఇరాన్ మత్స్యకార నౌకకు విముక్తి

48 గంటల సాహసోపేత ఆపరేషన్‌లో 20 మంది సిబ్బందికి ప్రాణరక్షణ

సముద్రం దేశాల మధ్య దూరాన్ని పెంచే జలరాశి మాత్రమే కాదు.. ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను అనుసంధానించే ప్రధాన వాణిజ్య మార్గం కూడా. అలాంటి సముద్ర మార్గాల్లో భద్రతకు ముప్పు ఏర్పడితే దాని ప్రభావం ఒక్క దేశానికే పరిమితం కాదు. అంతర్జాతీయ వాణిజ్యం, రవాణా, మత్స్యకారుల జీవనోపాధి, దేశాల మధ్య సంబంధాలపైనా పడుతుంది. ఈ నేపథ్యంలో అరేబియా సముద్రంలో సముద్ర దొంగల చెరలో చిక్కుకున్న ఇరాన్ మత్స్యకార నౌకను భారత నౌకాదళం విడిపించిన ఘటన ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. భారత వైమానిక దళం సహకారంతో నిర్వహించిన ఈ సాహసోపేత కార్యాచరణ సముద్ర భద్రత విషయంలో భారత్ సామర్థ్యాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. అరేబియా సముద్రంలో అక్టోబర్ 29న ఇరాన్‌కు చెందిన 'అజిని' మత్స్యకార నౌకను సోమాలియా సముద్ర దొంగలు హైజాక్ చేసినట్లు సమాచారం అందింది. నౌకలో ఉన్న 20 మంది సిబ్బంది ప్రాణాలు ప్రమాదంలో పడటంతో భారత నౌకాదళం అప్రమత్తమైంది. సముద్రంలో సుదూర ప్రాంతంలో ఉన్న నౌకను గుర్తించడం, దాని కదలికలను పర్యవేక్షించడం, అందులోని సిబ్బందికి ఎలాంటి హాని జరగకుండా విడిపించడం అత్యంత క్లిష్టమైన పని. అయినప్పటికీ భారత దళాలు సమన్వయంతో కార్యాచరణ చేపట్టాయి. ముంబయికి సుమారు మూడు వేల కిలోమీటర్ల దూరంలో నౌకను గుర్తించి, సముద్ర దొంగలను అడ్డుకున్నాయి. దాదాపు 48 గంటలపాటు సాగిన ఆపరేషన్ నవంబర్ 2న విజయవంతంగా ముగిసింది. ఎలాంటి ప్రాణనష్టం లేకుండా 20 మంది సిబ్బందిని రక్షించడం ఈ కార్యాచరణలో అత్యంత ముఖ్యమైన అంశం. సముద్ర దొంగలపై చర్యలు తీసుకోవడమంటే కేవలం ఆయుధాలతో ఎదురుదాడి చేయడం కాదు. బందీలుగా చిక్కుకున్న అమాయకుల ప్రాణాలను కాపాడుతూ పరిస్థితిని అదుపులోకి తీసుకురావడం అసలైన సవాల్. ఒక్క పొరపాటు జరిగినా నౌకలోని సిబ్బంది ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంటుంది. అందుకే ఇటువంటి ఆపరేషన్లలో వ్యూహాత్మక ప్రణాళిక, కచ్చితమైన సమాచారం, దళాల మధ్య సమన్వయం అత్యంత అవసరం. తాజా ఘటనలో భారత నౌకాదళానికి వైమానిక దళం సకాలంలో సహకరించడం విజయానికి దోహదపడింది. రెండు దళాలు సమన్వయంతో పనిచేస్తే క్లిష్టమైన పరిస్థితుల్లోనూ సానుకూల ఫలితాలు సాధించవచ్చనే సందేశాన్ని ఈ ఘటన అందించింది. హిందూ మహాసముద్రం ప్రపంచ వాణిజ్యంలో అత్యంత కీలకమైన ప్రాంతం. ఆసియా, ఆఫ్రికా, ఐరోపా దేశాల మధ్య సరకు రవాణాలో ఈ సముద్ర మార్గాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. చమురు, సహజ వాయువు, ఆహార ధాన్యాలు, పారిశ్రామిక ముడిసరకులు వంటి అనేక వస్తువులు నౌకల ద్వారానే రవాణా అవుతున్నాయి. ఈ మార్గాల్లో సముద్ర దొంగల దాడులు పెరిగితే నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. రవాణా వ్యయాలు పెరగడంతోపాటు అంతర్జాతీయ వాణిజ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ముఖ్యంగా చిన్న మత్స్యకార నౌకల్లో పనిచేసే సిబ్బంది భద్రత ప్రశ్నార్థకమవుతుంది. అందువల్ల సముద్ర దొంగల నియంత్రణను కేవలం ఒక దేశానికి సంబంధించిన సమస్యగా చూడకూడదు. అంతర్జాతీయ సహకారంతో ఎదుర్కోవాల్సిన ఉమ్మడి సవాల్‌గా పరిగణించాలి. భౌగోళికంగా హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత్‌కు ప్రత్యేక స్థానం ఉంది. సుదీర్ఘ తీరప్రాంతం, కీలక నౌకాశ్రయాలు, సముద్ర వాణిజ్యంపై ఆధారపడిన ఆర్థిక కార్యకలాపాలు దేశానికి సముద్ర భద్రతను అత్యంత ముఖ్యమైన అంశంగా మార్చాయి. భారత నౌకాదళం దేశ తీరప్రాంతాల రక్షణతోపాటు అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో భద్రతకు సహకరిస్తోంది. ప్రమాదంలో చిక్కుకున్న విదేశీ నౌకలకు సహాయం అందించడం ద్వారా సముద్ర భద్రతలో బాధ్యతాయుత భాగస్వామిగా వ్యవహరిస్తోంది. తాజా ఘటనలో రక్షించబడింది ఇరాన్‌కు చెందిన నౌక కావడం గమనార్హం. మానవ ప్రాణాల రక్షణకు దేశాల సరిహద్దులు అడ్డంకి కాకూడదనే మానవతా దృక్పథానికి ఇటువంటి చర్యలు నిదర్శనంగా నిలుస్తాయి. సముద్ర దొంగల కదలికలను ముందుగానే గుర్తించడం భద్రతా వ్యవస్థల ముందున్న ప్రధాన సవాల్. వేలాది కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న సముద్ర ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షించడం సాధారణ విషయం కాదు. ఇందుకోసం ఆధునిక నిఘా వ్యవస్థలు, ఉపగ్రహ సమాచారం, గగనతల పర్యవేక్షణ, నౌకల మధ్య సమాచార మార్పిడి కీలకం. సముద్రంలో అనుమానాస్పద కదలికలను గుర్తించిన వెంటనే సంబంధిత దేశాల నౌకాదళాలకు సమాచారం చేరే విధంగా అంతర్జాతీయ వ్యవస్థలను బలోపేతం చేయాలి. ముఖ్యంగా మత్స్యకార నౌకలకు అత్యవసర సమాచార వ్యవస్థలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. దాడి జరిగిన తర్వాత స్పందించడం ఎంత ముఖ్యమో, దాడులు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అంతకంటే ముఖ్యం. భారత నౌకాదళం చేపట్టిన ఆపరేషన్‌పై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసలు వ్యక్తం చేశారు. 48 గంటలపాటు సాగిన కార్యాచరణను విజయవంతంగా పూర్తి చేయడంలో నౌకాదళం చూపిన సామర్థ్యాన్ని అభినందించారు. భారత వైమానిక దళం సకాలంలో అందించిన సహకారాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. సముద్రంలో ఎదురయ్యే సంక్లిష్టమైన భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో భారత సాయుధ దళాల సమర్థతకు ఈ ఘటన నిదర్శనమని పేర్కొన్నారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో భద్రతకు భారత్ తన సహకారాన్ని కొనసాగిస్తుందన్న ఆయన వ్యాఖ్యలు సముద్ర రక్షణకు దేశం ఇస్తున్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నాయి. సముద్ర దొంగల చెర నుంచి 20 మంది సిబ్బందిని రక్షించడం అభినందనీయమే. అయితే ఈ విజయంతో సమస్య పూర్తిగా పరిష్కారమైందని భావించకూడదు. సోమాలియా తీరప్రాంతం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ పరిసరాల్లో సముద్ర దొంగల ముప్పు అంతర్జాతీయ నౌకా రవాణాకు సవాల్‌గా కొనసాగుతోంది. ఆర్థిక అస్థిరత, బలహీనమైన తీరప్రాంత పరిపాలన, అక్రమ కార్యకలాపాలు వంటి అంశాలు సముద్ర దోపిడీకి అనుకూల పరిస్థితులను సృష్టించవచ్చు. కేవలం సైనిక చర్యలతోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యం కాదు. సంబంధిత దేశాల మధ్య సమాచార సహకారం, చట్టపరమైన చర్యలు, తీరప్రాంత భద్రత బలోపేతం వంటి అంశాలపైనా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. యుద్ధ నౌకల శక్తి, ఆధునిక ఆయుధాల సామర్థ్యం, సాంకేతిక పరిజ్ఞానం దేశ రక్షణకు ఎంత ముఖ్యమో, వాటిని మానవ ప్రాణాల పరిరక్షణకు వినియోగించడం కూడా అంతే ముఖ్యం. సముద్ర దొంగల చెరలో చిక్కుకున్న 20 మంది సిబ్బందిని సురక్షితంగా విడిపించడం ద్వారా భారత దళాలు ఆ బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాయి. సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రాకపోకలు కొనసాగాలంటే భద్రతతోపాటు అంతర్జాతీయ విశ్వాసం అవసరం. తాజా కార్యాచరణ ఆ విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే అవకాశముంది.

రాహుల్‌పై బీజేపీ తీవ్ర విమర్శలు!

- 'జుగుప్సాకరమైన వ్యక్తి' అంటూ మండిపడ్డ సీఆర్ కేశవన్
- విదేశీ సాయంతోనే మోదీ అధికారంలో ఉన్నారన్న రాహుల్ ఆరోపణలపై ఆగ్రహం
- దేశ అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యాన్ని కోరింది రాహులేనని విమర్శ
- కాంగ్రెస్‌కు విదేశీ సంస్థలతో సంబంధాలున్నాయని ఆరోపణలు
- రహస్య విదేశీ పర్యటనల వెనుక అజెండా ఏమిటని ప్రశ్న



న్యూఢిల్లీ, నవంబర్ 3 (సమయం న్యూస్): విదేశీ శక్తుల సహకారంతోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలో కొనసాగుతున్నారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. రాహుల్ వ్యాఖ్యలను తప్పుబట్టిన బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ ఆయనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీని 'జుగుప్సాకరమైన వ్యక్తి'గా అభివర్ణిస్తూ విమర్శలు గుప్పించారు. నిరాధారమైన ఆరోపణలు చేయడం, చివరకు నవ్వులపాలు కావడం రాహుల్‌కు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా రాహుల్ వ్యాఖ్యలను ఖండించారు. బీజేపీ ఆర్థిక వ్యవస్థను విదేశీయులే నియంత్రిస్తున్నారని, విదేశీ సహకారంతోనే మోదీ ప్రభుత్వం అధికారంలో కొనసాగుతోందని రాహుల్ గాంధీ ఆరోపించిన నేపథ్యంలో ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం ముదిరింది. రాహుల్ ఆరోపణలకు ఆధారాలేమిటని బీజేపీ ప్రశ్నిస్తోంది. మరోవైపు కేశవన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. 2023 మార్చిలో బ్రిటన్ పర్యటన సందర్భంగా భారత ప్రజాస్వామ్యంపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను కేశవన్ ప్రస్తావించారు. దేశ అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యాన్ని కోరింది రాహులేనని ఆరోపించారు. అప్పట్లో రాహుల్ మాట్లాడిన వీడియోను తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్నారు. భారత ప్రజాస్వామ్యం గురించి విదేశీ గడ్డపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని విమర్శించారు. కాంగ్రెస్ నాయకత్వానికి ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని ప్రజాస్వామ్య నాయకుల వేదికతో సంబంధాలు ఉన్నాయని కేశవన్ ఆరోపించారు. జార్జ్ సోరోస్‌కు సంబంధించిన ఫౌండేషన్ నుంచి కాంగ్రెస్‌కు నిధులు అందాయని కూడా పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన స్వతంత్ర ఆధారాలు వెల్లడికాలేదు. బీజేపీ చేసిన ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా పరిగణించలేము. రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలపైనా కేశవన్ ప్రశ్నలు సంధించారు. రాహుల్ తరచూ రహస్యంగా విదేశాలకు ఎందుకు వెళ్తున్నారని, అక్కడ ఎవరిని కలుస్తున్నారని నిలదీశారు. ఆ సమావేశాల వెనుక అసలు అజెండా ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. దేశ రాజకీయాల్లో విదేశీ ప్రభావం గురించి మాట్లాడే ముందు రాహుల్ తన విదేశీ సంబంధాలపై స్పష్టత ఇవ్వాలని కేశవన్ వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీపై రాహుల్ చేసిన ఆరోపణలు, వాటికి ప్రతిగా బీజేపీ సంధించిన విమర్శలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అయితే ఇరుపక్షాలు చేసిన విదేశీ ప్రభావం, నిధుల సంబంధిత ఆరోపణలకు స్వతంత్ర ధ్రువీకరణ అవసరం. రాజకీయ విమర్శలకంటే వాటికి సంబంధించిన ఆధారాలే కీలకమన్న అంశం ఈ వివాదంతో మరోసారి ముందుకొచ్చింది.

త్రిపురలో ఘోరం

బీఎస్ఎఫ్ జవాన్లపై కర్రలతో దాడి..

ఆయుధాలు సైతం లాక్కొనే యత్నం!



అగర్తలా, నవంబర్ 3 (సమయం న్యూస్): త్రిపుర సరిహద్దు ప్రాంతంలో ఊహించని ఘోర సంఘటన వెలుగులోకి వచ్చింది. దేశ రక్షణలో అహర్నిశలు శ్రమిస్తున్న సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) జవాన్లపై స్మగ్లర్లు బరితెగించి దాడులకు తెగబడ్డారు. సీపాహిజాలా జిల్లాలోని బోక్సానగర్ పరిధిలో గల ఆశబరి సరిహద్దు ప్రాంతంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. సరిహద్దుల నుంచి నిషేధిత వస్తువులను అక్రమంగా బంగ్లాదేశ్‌కు రవాణా చేస్తున్నారనే పక్కా సమాచారంతో గస్తీ తిరుగుతున్న బీఎస్ఎఫ్ జవాన్లు రెహమాన్ అనే ప్రధాన స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి అరెస్టును జీర్ణించుకోలేని మిగతా స్మగ్లర్లు, కొందరు స్థానిక గ్రామస్థులు ఒక్కసారిగా జవాన్ల వాహనాన్ని చుట్టుముట్టారు. చేతుల్లో కర్రలు, పదునైన ఆయుధాలు పట్టుకుని జవాన్లపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. అంతేకాకుండా జవాన్ల తలలపై విచక్షణారహితంగా కొట్టి, వారి వద్ద ఉన్న ఆయుధాలను లాక్కునేందుకు ప్రయత్నించడం తీవ్ర కలకలం రేపింది. ఈ దారుణ దాడిలో పలువురు జవాన్లు తీవ్రంగా గాయపడటంతో పాటు ప్రభుత్వ వాహనం కూడా దారుణంగా ధ్వంసమైంది. ఈ ఘటన వెనుక సరిహద్దు ఆవల ఉన్న బంగ్లాదేశీయుల ప్రమేయం కూడా ఉందనే వార్తలు వస్తుండటంతో సరిహద్దు గ్రామాల్లో తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తీవ్రంగా స్పందించారు. శాంతిభద్రతలను విచ్ఛిన్నం చేస్తూ దేశ రక్షణ బాధ్యతల్లో ఉన్న బీఎస్ఎఫ్ జవాన్లపై దాడులకు తెగబడటం ఏమాత్రం సహించరాని అపరాధమని స్పష్టం చేశారు. దాడికి పాల్పడిన ఉగ్ర మూకలను ఎంతమాత్రం విడిచిపెట్టేది లేదని, వారిపై చట్టప్రకారం అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో అదనపు భద్రతా బలగాలను మోహరించి, దాడి చేసి పరారైన నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు.

నేపాల్‌లో రెండు హెలికాప్టర్లు ఢీ
భారతీయుడి మృతి!

ల్యాండింగ్ సమయంలో ఒకదానికొకటి తగిలిన రోటర్లు

సోలుఖుంబు ప్రాంతంలోని ఫెరిచే హెలిప్యాడ్ వద్ద ప్రమాదం



కాఠ్‌మాండు/న్యూ ఢిల్లీ, నవంబర్ 3 (సమయం న్యూస్): పొరుగు దేశమైన నేపాల్‌లో మంగళవారం ఉదయం అత్యంత భయానక వాయు ప్రమాదం సంభవించింది. సోలుఖుంబు జిల్లాలోని ఫెరిచే హెలిప్యాడ్ వద్ద ల్యాండింగ్ సమయంలో రెండు చిన్న హెలికాప్టర్లు అనూహ్యంగా ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ దారుణ ఘటనలో భారత పర్యాటకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, ఒక ఎన్ఆర్ఐ సహా పైలట్ తీవ్రంగా గాయపడ్డారని నేపాల్ పోలీసులు అధికారికంగా వెల్లడించారు. తమకు అత్యంత సమీపంలోనే రొటేటింగ్ వింగ్స్ ఢీకొనడంతో హెలిప్యాడ్ పరిసరాల్లో ఉన్న ప్రజలు, పర్యాటకులు భయాందోళనలతో పరుగులు తీశారు. ల్యాండింగ్‌కు కొద్ది క్షణాల ముందు 'ఫిష్‌టెయిల్ ఎయిర్', 'ఎయిర్ డైనాస్టీ' సంస్థలకు చెందిన రెండు హెలికాప్టర్ల రోటర్లు బలంగా తాకడంతో ఈ ప్రమాదం జరిగింది. ఫిష్‌టెయిల్ ఎయిర్ హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న భారతీయ పర్యాటకుడు తీవ్ర గాయాలపాలై మరణించారు. మృతి చెందిన వ్యక్తిని తమిళనాడులోని చెన్నై నగరానికి చెందిన వసంత్ కుమార్ బలరామరామడు (47)గా అధికారులు గుర్తించారు. ఇదే ప్రమాదంలో భారత సంతతికి చెందిన న్యూజిలాండ్ వాసి శైలేష్ క్రిష్ణా పటేల్ (49) తీవ్రంగా గాయపడగా, ఆయన్ను, ఎయిర్ డైనాస్టీ పైలట్‌ను అత్యవసర వైద్యం కోసం రాజధాని కాఠ్‌మాండులోని మెడిసిటీ ఆసుపత్రికి ఎయిర్‌లిఫ్ట్ చేశారు. పర్వత ప్రాంతమైన నేపాల్‌లో పర్యాటకం, పర్వతారోహణ, అత్యవసర వైద్య రవాణా కోసం చిన్న హెలికాప్టర్ల వినియోగం అత్యధికంగా ఉంటుంది. అయితే వేగంగా మారే ప్రతికూల వాతావరణ పరిస్థితులు, సంక్లిష్టమైన భౌగోళిక వ్యూహాల కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల భారత భూభాగంలోని ఉత్తరాఖండ్‌లో చమోలీ సమీపంలోనూ బద్రీనాథ్ నుంచి దేహ్రాదూన్ వెళ్తున్న హెలికాప్టర్ కూలి పైలట్ సహా ఆరుగురు మరణించిన సంగతి తెలిసిందే. కాగా, సోలుఖుంబు ఘటనపై నేపాల్ సివిల్ ఏవియేషన్ అథారిటీ సమగ్ర విచారణకు ఆదేశించింది.

నిరసన హక్కు ఉంది..
ఇతరుల హక్కులనూ గౌరవించాలి!

- ఆందోళనల పేరుతో బహిరంగ ప్రదేశాలను నిరవధికంగా ఆక్రమించలేరు
- ఢిల్లీ వ్యాపార సంఘాల పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- నిరసన నిర్వాహకులను ప్రతివాదులుగా చేర్చాలని న్యాయస్థానం ఆదేశం
- కేంద్రంతోపాటు సంబంధిత పక్షాలకు నోటీసులు జారీ

న్యూఢిల్లీ, నవంబర్ 3 (సమయం న్యూస్): ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, అయితే ఆ హక్కు పేరుతో ఇతరుల హక్కులకు భంగం కలిగించరాదని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీలో సుదీర్ఘంగా కొనసాగుతున్న ఆందోళనల కారణంగా వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని వ్యాపార సంఘాలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రాథమిక హక్కుల పేరుతో నిరసన ప్రాంతాలను నిరవధికంగా ఆక్రమించుకోవడం సమంజసం కాదని అభిప్రాయపడింది. సమాజంలో ఇతర వర్గాల ప్రజలకు కూడా తమ సమస్యలపై గళమెత్తే హక్కు ఉంటుందని గుర్తించాలని సూచించింది. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వంతోపాటు సంబంధిత పక్షాలకు నోటీసులు జారీ చేసింది. ఢిల్లీలో కొనసాగుతున్న ఆందోళనల కారణంగా వ్యాపార కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని వ్యాపార సంఘాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ముఖ్యంగా పండుగల సీజన్‌లో కన్నాట్ ప్లేస్ వంటి ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లో నిరసనల వల్ల వ్యాపారాలు దెబ్బతిన్నాయని పిటిషన్‌లో పేర్కొన్నాయి. రహదారులపై ఆందోళనలు, రాకపోకలకు అంతరాయాల కారణంగా వ్యాపారులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించాయి. దాదాపు 50 లక్షల మంది ప్రజలపై ఈ పరిస్థితుల ప్రభావం పడుతోందని వ్యాపార సంఘాలు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లాయి. తమ సమస్యలను పరిగణనలోకి తీసుకుని తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరాయి. పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు నిరసనలు నిర్వహిస్తున్న వారిని కూడా ప్రతివాదులుగా చేర్చాలని ఆదేశించింది. ఆందోళన నిర్వాహకులను పిటిషన్‌లో భాగస్వాములను చేయకుండా వారి హక్కులను ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకోవడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. అందువల్ల నిరసనకారులు, ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న వారి పేర్లను ప్రతివాదుల జాబితాలో చేర్చాలని పిటిషనర్లకు సూచించింది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాతే తగిన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే స్వేచ్ఛకు రాజ్యాంగపరమైన ప్రాధాన్యం ఉందని, అదే సమయంలో ఇతరుల జీవనోపాధి, రాకపోకలు, సాధారణ కార్యకలాపాలకు సంబంధించిన హక్కులను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఒక వర్గం తమ హక్కులను వినియోగించుకునే క్రమంలో మరో వర్గం ప్రజలు నిరంతరం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు తలెత్తకూడదన్న అంశాన్ని ప్రస్తావించింది. నిరసనల నిర్వహణలో ప్రజల సౌకర్యాలు, శాంతిభద్రతలు, వ్యాపార కార్యకలాపాల మధ్య సమతుల్యత అవసరమని అభిప్రాయపడింది. మరోవైపు ఢిల్లీలో నిరసనల సందర్భంగా పెద్దఎత్తున వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం, పోలీసుల బలప్రయోగం, మెట్రో స్టేషన్ల మూసివేత, అంతర్జాల సేవల నిలిపివేత వంటి అంశాలపై దాఖలైన పిటిషన్లను కూడా సుప్రీంకోర్టు విచారించింది. నిరసనల సందర్భంగా తీసుకునే భద్రతా చర్యలు, వాటి ప్రభావంపై న్యాయస్థానం దృష్టి సారించింది. ఈ వ్యవహారాల్లో సంబంధిత పక్షాల వాదనలు, ప్రభుత్వ వివరణలు కీలకం కానున్నాయి.



జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై అఖిలపక్ష సమావేశం

- సమస్య పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశం
- నాగారం ఎంవీఆర్ ఫంక్షన్ హాల్‌లో రేపు సమావేశం.. రాజకీయ పార్టీలకు వజ్రేష్ యాదవ్ ఆహ్వానం

మేడ్చల్–మల్కాజిగిరి, నవంబర్ 2 (సమయం):

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశించారు. ఈ సమస్యపై సమగ్రంగా చర్చించి, పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు.దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మహేష్ కుమార్ గౌడ్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, అన్ని పార్టీల అభిప్రాయాలు సేకరించి సమస్య పరిష్కారానికి ఉమ్మడి కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.ఈ ఆదేశాల మేరకు నవంబర్ 3, మంగళవారం ఉదయం 11 గంటలకు నాగారంలోని ఎంవీఆర్ ఫంక్షన్ హాల్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తోటకూర వజ్రేష్ యాదవ్ వెల్లడించారు.ఈ సమావేశానికి



అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, డంపింగ్ యార్డ్ సమస్యపై పోరాటం చేస్తున్న నాయకులు, మద్దతుదారులు హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమస్యపై తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేసి, పరిష్కారం దిశగా జరిగే ఉమ్మడి ప్రయత్నాలకు సహకరించాలని కోరారు.

పట్టభద్రులారా.. మీ ఓటు.. మీ భవిష్యత్తుకు భరోసా!

- విద్యావంతుల చైతన్యమే ప్రజాస్వామ్యానికి రక్ష
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై జనసేన అవగాహన కార్యక్రమం
- జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి 'మేరుగు శివకోటి యాదవ్'

నర్సంపేట, నవంబర్ 3 (సమయం న్యూస్) :

ప్రజాస్వామ్య పరిరక్షణలో పట్టభద్రుల పాత్ర అత్యంత కీలకమని జనసేన పార్టీ నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు శివకోటి యాదవ్ అన్నారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ఆయన ఆధ్వర్యంలో నర్సంపేట డివిజన్ పరిధిలోని మహేశ్వరంలోని శివాని పబ్లిక్ స్కూల్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గదల శ్రీనివాసరావు అభ్యర్థిత్వాన్ని ఉపాధ్యాయులకు వివరించారు. అర్హులైన ఉపాధ్యాయులు, పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనదని, దాని వినియోగంపై ప్రతి పట్టభద్రుడు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శివాని పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ గిరగాని రాహుల్, ప్రిన్సిపల్ మొలుగూరి సురేందర్, ఉపాధ్యాయ బృందం, జనసేన నాయకులు గంగుల రంజిత్, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.



25 ఏళ్ల అనుబంధం.. 'పెద్ది' మరణంతో తీరని వేదన.!

- రాజకీయ ప్రయాణంలో తోడుగా నిలిచిన నేత దూరమయ్యారు
- పదవుల కోసం కాదు.. ప్రజల కోసమే ఇకపై నా ప్రయాణం
- బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు యాదవ్

నర్సంపేట, నవంబర్ 3 (సమయం న్యూస్) :

పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం తన వ్యక్తిగత జీవితానికి, రాజకీయ ప్రస్థానానికి ఎన్నటికీ పూడ్చలేని లోటని బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు యాదవ్ భావోద్వేగానికి లోనయ్యారు. పెద్ది కుటుంబానికే కాకుండా బీఆర్ఎస్ పార్టీకి, నర్సంపేట నియోజకవర్గ ప్రజలకు, నియోజకవర్గ అభివృద్ధికి తీరని నష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మరణించి నాలుగు నెలలు గడుస్తున్నా ఆ బాధ నుంచి బయటపడలేకపోతున్నానని పేర్కొన్నారు.ఊహ తెలిసినప్పటి నుంచే రాజకీయాలపై ఆసక్తితో తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించినట్లు ఆబోతు రాజు యాదవ్ తెలిపారు. తెలుగు యువత పట్టణ ప్రధాన కార్యదర్శిగా, మండల ప్రధాన కార్యదర్శిగా, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడిగా, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శిగా రెండుసార్లు వివిధ బాధ్యతలు నిర్వహించినట్లు వివరించారు.2014లో కౌన్సిలర్‌గా పోటీ చేయాలనే లక్ష్యంతో ప్రయత్నించినప్పటికీ టికెట్ కేటాయింపులో జాప్యం కారణంగా ఆటో గుర్తుపై స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగినట్లు గుర్తుచేశారు. అప్పటి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తనకు మద్దతుగా నిలిచి ప్రచారం చేశారని తెలిపారు. సుమారు 15 ఏళ్ల పాటు పార్టీ కోసం పనిచేసినా తగిన గుర్తింపు లభించలేదనే ఆవేదనతో 2015లో తెలంగాణ భవన్‌లో కేసీఆర్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరినట్లు వెల్లడించారు.అప్పటి నుంచి పెద్ది సుదర్శన్ రెడ్డి నాయకత్వంలో నిబద్ధతతో పనిచేశానని, ఈ క్రమంలో ఎన్నో రాజకీయ ఒడిదుడుకులు ఎదుర్కొన్నానని తెలిపారు. 2017లో తనపై కేసు నమోదు కావడం, 2020లో విచారణకు హాజరుకావడం వంటి పరిణామాలను ప్రస్తావించారు.రాజకీయంగా ఎదగాలనే ఆకాంక్షతో ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ, టికెట్ కేటాయింపు విషయంలో పెద్ది సుదర్శన్ రెడ్డి తనతో మాట్లాడి యాదవ సామాజిక వర్గానికి రెండు స్థానాలు కేటాయించిన నేపథ్యంలో తన వార్డులో చైర్మన్ అభ్యర్థికి అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారని వివరించారు. ఆయన మాటకు విలువనిస్తూ తాను పోటీ నుంచి తప్పుకున్నట్లు తెలిపారు .2025లోనూ టికెట్ విషయంలో ఇలాంటి పరిస్థితి ఎదురైందని, మహిళా రిజర్వేషన్, పార్టీ అధికారంలో లేకపోవడం, రెబల్ అభ్యర్థి బరిలో ఉండటం వంటి కారణాలతో పెద్ది సుదర్శన్ రెడ్డి మాటను గౌరవించి స్వచ్ఛందంగా పోటీ నుంచి తప్పుకున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందనే ఆశతో ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు.తన రాజకీయ సామర్థ్యాన్ని, కష్టాన్ని, 25 ఏళ్ల రాజకీయ, సామాజిక ప్రస్థానాన్ని దగ్గరగా గమనించిన నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అని, ఆయన దూరమవడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనతో పంచుకున్న అనుభవాలు, ఇచ్చిన భరోసాలు, కలిసి సాగించిన రాజకీయ ప్రయాణం జీవితాంతం గుర్తుండిపోతాయని పేర్కొన్నారు.



ప్రజల మధ్యనే భవిష్యత్ ప్రయాణం...

పదవులు, రాజకీయ హోదాల కంటే ప్రజాసేవకే ప్రాధాన్యమిస్తూ భవిష్యత్తులో తన ప్రయాణాన్ని ప్రజల మధ్యనే కొనసాగిస్తానని ఆబోతు రాజు యాదవ్ స్పష్టం చేశారు. 25 ఏళ్ల రాజకీయ, సామాజిక అనుభవంతో పాటు వివిధ సంఘాల్లో నిర్వహించిన బాధ్యతలు, అన్ని సామాజిక వర్గాల ప్రజలతో ఉన్న అనుబంధాన్ని ప్రజాసేవకు వినియోగిస్తానన్నారు.బీసీ వాదాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు బీసీ కులాల హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. అన్యాయానికి, అక్రమాలకు గురైన వారికి అండగా నిలుస్తూ రైతులు, నిరుద్యోగ యువత, పేదలు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి తనవంతు పోరాటం చేస్తానన్నారు. నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధిలోనూ భాగస్వామినవుతానని వెల్లడించారు.పదవుల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేయడమే తన లక్ష్యమని, పెద్ది సుదర్శన్ రెడ్డి ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తిని గౌరవిస్తూ తన రాజకీయ, సామాజిక ప్రస్థానాన్ని కొనసాగిస్తానని ఆబోతు రాజు యాదవ్ స్పష్టం చేశారు.

నర్సంపేటలో పౌరసేవలకు గ్రహణం..

- ప్రజల ఇబ్బందులపై కలెక్టర్‌కు ఫిర్యాదు
- కమిషనర్ లాగిన్, డిజిటల్ 'కీ' పనిచేయక ప్రజలకు ఇబ్బందులు
- డీమ్డ్ అప్రూవల్ అనుమతులపై సమగ్ర విచారణ జరపాలి
- మాదాసి ప్రవీణ్, కందికొండ శ్రీనివాస్

నర్సంపేట, నవంబరు 3 (సమయం న్యూస్) :

నర్సంపేట పురపాలక సంఘంలో పౌరసేవలు అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని పౌరసేవలు అందించాలని మాదాసి ప్రవీణ్, కందికొండ శ్రీనివాస్ ఆరోపించారు. కమిషనర్ లాగిన్, డిజిటల్ 'కీ' పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సమస్యలతో పాటు ఇంటి నంబర్ల కేటాయింపులో జరుగుతున్న జాప్యం, డీమ్డ్ అప్రూవల్ విధానంలో అనుమానాస్పదంగా అనుమతులు పొందిన దరఖాస్తులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ లాగిన్, డిజిటల్ 'కీ' ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి పనిచేయడం లేదని వినతిలో పేర్కొన్నారు. దీంతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీతోపాటు ఇతర పురపాలక సేవలు పొందడంలో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ద్వారా ప్రజలకు అందాల్సిన వివిధ ప్రభుత్వ సేవలు, ధ్రువీకరణ పత్రాలు, అనుమతులు, ఇతర పరిపాలనా కార్యకలాపాలు సకాలంలో పూర్తికావడం లేదని వివరించారు.



డీమ్డ్ అప్రూవల్‌పై అనుమానాలు...

సహజంగా మున్సిపల్ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు నిబంధనల ప్రకారం పరిశీలన జరిపి నిర్ణీత సమయంలో అనుమతులు మంజూరు చేయాల్సి ఉంటుంది. అయితే డీమ్డ్ అప్రూవల్ విధానంలో కొన్ని దరఖాస్తులకు అనుమతులు లభించినట్లు తెలుస్తోందని, ఈ ప్రక్రియలో నిబంధనలు పాటించారా లేదా అన్న అంశంపై సందేహాలు ఉన్నాయని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. సంబంధిత దరఖాస్తులు, అనుమతులు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను వెలికితీయాలని కోరారు.ఆగస్టు 15 నుంచి ఇప్పటివరకు జారీ చేసిన ఇంటి నంబర్లు, డీమ్డ్ అప్రూవల్ ద్వారా మంజూరైన అనుమతులు, వాటికి సంబంధించిన దరఖాస్తులు, పత్రాలు, ఆమోదాల వివరాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు మంజూరై ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే మున్సిపల్ సేవలను వెంటనే పునరుద్ధరించి, కమిషనర్ లాగిన్, డిజిటల్ కీ సమస్యను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ప్రభుత్వ స్థలాలు, మున్సిపల్ స్థలాలు,ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నర్సంపేట పురపాలక సంఘం పరిపాలనను సమర్థంగా నిర్వహించడంతోపాటు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పౌరసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని పౌరసేవలు అందించాలని మాదాసి ప్రవీణ్, కందికొండ శ్రీనివాస్ కలెక్టర్‌ను కోరారు.

పేదల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇళ్లు

ఖమ్మం, నవంబర్ 3(సమయం న్యూస్)

ఇందిరమ్మ ఇళ్లు పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, కళ్యాణలక్ష్మి-షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు మండలంలో రెండో విడతలో 187 మందికి ఇళ్ల మంజూరు పత్రాలు అందిస్తున్నామని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయంతో ఇల్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. మొదటి విడతలో మంజూరైన 810 ఇళ్లలో సుమారు 700 ఇళ్లు పూర్తయ్యాయని చెప్పారు. అనంతరం ఏలువారిగూడెంలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి, రూ.2 కోట్ల బీటీ రోడ్డు, రూ.48 లక్షల నీటి నిల్వ ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.



బీఆర్ఎస్ నాయకులు రేఖం యదయ్యను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

దుద్యాల మండలం, నవంబర్,03(సమయం న్యూస్)

కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేట్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రేఖం యాదయ్య అనారోగ్య కారణాలతో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి రేఖం యాదయ్యని పరామర్శించారు.వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఆసుపత్రి వైద్య సిబ్బందితో మాట్లాడి, మెరుగైన వైద్యం అందిస్తూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు , మాజీ ఎమ్మెల్యే తో పాటు దుద్యాల మండలం బీఆర్ఎస్ యువజన నాయకులు లగచర్ల సురేష్,ఉన్నారు.



ఆర్థిక సహాయం అందజేసిన ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత

వలిగొండ నవంబర్ 03 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని పైల్వాన్ పురం గ్రామానికి చెందిన రేపాక యాదయ్య చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులకు ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత బిఆర్ఎస్ జిల్లా నాయకులు జంగారెడ్డి సహకారంతో ఏజేఆర్ ఫౌండేషన్ సభ్యులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి 5,000/ రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజేఆర్ ఫౌండేషన్ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



డిసెంబర్ 15 నుంచి ఆశా కార్యకర్తల నిరవధిక సమ్మె

- మెడికల్ ఆఫీసర్లకు సమ్మె నోటీసులు..
- ప్రభుత్వం వెంటనే స్పందించాలి... బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు 'గోనె యువరాజు'

నర్సంపేట, నవంబర్ 3 (సమయం న్యూస్)

ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా విధులను బహిష్కరించి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం నర్సంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, బాంజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లకు ఆశా కార్యకర్తలతో కలిసి సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా గోనె యువరాజు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేల స్థిర వేతనం చెల్లించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. తమ సమస్యలను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో సమ్మెకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తలంతా విధులను బహిష్కరించి నిరవధిక సమ్మెలో పాల్గొంటారని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పీపీ యూనిట్ అధ్యక్షురాలు సంధ్య, బాంజీపేట పీహెచ్‌సీ అధ్యక్షురాలు సునీత, నాయకులు లలిత, రమ, సరోజన, లత, విజయ తదితరులు పాల్గొన్నారు.



40 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

- పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వ ఆర్థిక సాయం ఎంతో భరోసా – ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 3 (సమయం):

పేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక చేయూత అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.మల్కాజిగిరి ఎమ్మార్వో కార్యాలయంలో ఎమ్మార్వో సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్హులైన 40 మంది లబ్ధిదారులకు ఆయన స్వయంగా చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు అండగా నిలిచే సంక్షేమ పథకాలు అర్హులైన వారికి సకాలంలో అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, అర్హులకు ఎలాంటి జాప్యం లేకుండా ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రజలకు చేరవేయడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.



విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి

- **ఎడిఇ కె.శ్రీకాంత్.**

రామన్నపేట నవంబర్ 03 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో విద్యుత్ వినియోగదారులకు సమస్యలు లేకుండా మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని విద్యుత్ శాఖ ఏడీఈ. కె.శ్రీ కాంత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు వ్యవసాయ బావులవద్ద విద్యుత్ వినియోగ సామర్థ్యం పెంపు కోసం ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన పంపు సెట్లు,కెపాసిటర్లను వాడాలని సూచించారు. వినియోగదారులు విద్యుత్ పొదుపుగా వాడుకోవాలని, విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు యం కోటేశ్వరరావు, జె.నరసింహా, ఏఏవో డి. మోతీరాం, సిబ్బంది యం నటరాజ్, కే.శ్రీనివాస్ రెడ్డి, .పాల్గొన్నారు.



రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఘనంగా ప్రత్యేక పూజలు

- **క్రాంతినగర్ ప్రజల ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాల కోసం ప్రత్యేక సంకల్పం**

ఆలేరు, నవంబర్ 03(సమయం న్యూస్):

ఆలేరు పట్టణంలోని క్రాంతినగర్ వాసుల ఆధ్వర్యంలోని సిల్క్ నగర్ లోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ అర్చకులు మంగళగిరి రాజు పంతులు పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో క్రాంతినగర్‌కు చెందిన భక్తులతో పాటు సుధగాని సాగర్, ప్రశాంతి కుందెన, భానుచందు, అనురాధ ప్రత్యేకంగా పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. అర్చకులు మంగళగిరి రాజు పంతులు భక్తులచే ప్రత్యేక సంకల్పం చేయిస్తూ క్రాంతినగర్ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. భక్తి భావంతో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. పూజలు ముగిసిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఎలగందుల శ్రీనివాస్, పద్మ, భక్తులు చెన్న మహాలక్ష్మి, చెన్న రాజేష్‌తో పాటు క్రాంతినగర్‌కు చెందిన పలువురు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పార్టీ లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

- **రెడ్డి నాయక్ తండాలో సుమారు 50 మంది కార్యకర్తల చేరిక.**

భువనగిరి నవంబర్ 03 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం రెడ్డి నాయక్ తండాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు భూక్య భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి సమక్షంలో ఈ చేరికల కార్యక్రమం నిర్వహించారు.



అమరవీరుల ఆశయ సాధనకు నిరంతర పోరాటం

- **ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై జనార్ధన్ విమర్శ**

ఆలేరు, నవంబర్ 3(సమయం న్యూస్):

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు గడిచినా ప్రజలు రేషన్ బియ్యం, సబ్సిడీలు, ఉచితాలపై ఆధారపడి జీవించాల్సిన పరిస్థితులు కొనసాగుతున్నాయని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాచకొండ జనార్ధన్ అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలో అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సబ్‌డివిజన్ నాయకులు రేగు శ్రీశైలం ఎర్ర జెండాను ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ, గిరిజన ప్రజల హక్కులను కాపాడటంలో విఫలమయ్యాయని విమర్శించారు. భూమి, స్వేచ్ఛ, సమానత్వం కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలు వృథా కావని, వారి ఆశయ సాధన కోసం ప్రజా ఉద్యమాలను కొనసాగిస్తామని అన్నారు. చంద్ర పుల్లారెడ్డి, పొట్ల రామనర్సయ్య, జంపాల చంద్రశేఖర ప్రసాద్, శ్రీపాద శ్రీహరి తదితర విప్లవ నాయకుల పోరాటాలను స్మరించుకుంటూ ప్రజా హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళ్లెపు అడివయ్య, మామిడాల బాలమల్లేష్, మారుజోడు సిద్ధేశ్వర్, వడ్డేపల్లి బాలరాజు, దయ్యాల సిద్ధులు, పుప్పాల మల్లయ్య, కోజిగ వీరయ్య, కోయ బాబు, జూకంటి చంద్రయ్య, బండి స్వామి, గవ్వల బాలయ్య, బైకని బిక్షపతి పాల్గొన్నారు.



విద్యావంతుడైన సర్వోత్తం రెడ్డిని గెలిపించుకోవాలి

- **కాకతీయ వర్సిటీ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ**
- **ఉద్యోగులు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి**
- **కాకతీయ కీర్తిని చాటేలా వర్సిటీ అభివృద్ధికి కృషి**
- **గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా సర్వోత్తం రెడ్డిని ఆదరించాలి...ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

హనుమకొండ, నవంబర్ 3 (సమయం న్యూస్)



కాకతీయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. వర్సిటీకి అవసరమైన నిధులు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డికి మద్దతు తెలిపి గెలిపించాలని పట్టభద్రులను కోరారు.కాకతీయ విశ్వవిద్యాలయంలో ఉద్యోగులు, విద్యార్థులు, మేధావులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, శాసనమండలి సభ్యుడు బస్వరాజు సారయ్య, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి, రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, అయూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ సర్వోత్తం రెడ్డి ఉన్నత విద్యావంతుడని, విద్యారంగ సమస్యలపై అవగాహన కలిగిన వ్యక్తి అని అన్నారు. ఆయన తండ్రి టైగర్ దామోదర్ రెడ్డి ప్రజల కోసం ఎన్నో త్యాగాలు చేసిన నాయకుడని గుర్తుచేశారు.అలాంటి కుటుంబం నుంచి వచ్చిన సర్వోత్తం రెడ్డికి పట్టభద్రులు ఆశీర్వాదం అందించాలని కోరారు. కాకతీయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు.ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థిగా చెప్పుకోవడం గర్వంగా ఉందన్నారు. వర్సిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కాంట్రాక్టు లెక్చరర్లు, అధ్యాపకులు, విద్యార్థుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. సర్వోత్తం రెడ్డిని గెలిపిస్తే వర్సిటీ సమస్యలను సమర్థంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగలరని పేర్కొన్నారు.ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయ సమస్యలను గతంలోనే ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని, కొన్ని సమస్యల పరిష్కారంపై స్పష్టత వచ్చిందని తెలిపారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి పర్యటనతో మరిన్ని అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని విద్యారంగ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. అభ్యర్థి విద్యార్హతలు, సామర్థ్యాలను పరిశీలించి పట్టభద్రులు ఓటు వేయాలని కోరారు.శాసన మండలి సభ్యుడు బస్వరాజు సారయ్య మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయ అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వాల పాత్ర కీలకమని అన్నారు. ఇంజినీరింగ్ కళాశాల మంజూరు సహా పలు అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ హయాంలోనే జరిగాయని గుర్తుచేశారు. మంచి కుటుంబ నేపథ్యం, రాజకీయ అనుభవం కలిగిన సర్వోత్తం రెడ్డిని గెలిపించాలని కోరారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయంలో గోల్డ్ మెడలిస్ట్‌గా విద్యాభ్యాసం పూర్తి చేశానని, అనంతరం అమెరికాలోని ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో రెండు మాస్టర్స్ డిగ్రీలు పొందినట్లు తెలిపారు. ఫైనాన్షియల్ స్టాటజీ, ఇంటర్నేషనల్ మేనేజ్‌మెంట్‌లో ఉన్నత విద్య పూర్తి చేసి క్యాపిటల్ వన్ బ్యాంక్‌తో పాటు అమెరికా, కెనడా, లండన్ తదితర ప్రాంతాల్లో కార్పొరేట్ రంగంలో పనిచేసిన అనుభవం ఉందన్నారు. రాజకీయ వ్యవస్థకు, కార్పొరేట్ రంగానికి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించి యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 14 వేల కిలోమీటర్లు ప్రయాణించి పట్టభద్రులను కలిశానని, నియోజకవర్గ పరిధిలోని ప్రతి మండలానికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటానని హామీ ఇచ్చారు.కాకతీయ విశ్వవిద్యాలయంలో 489 రెగ్యులర్ పోస్టులు ఉండగా, ప్రస్తుతం 77 మంది మాత్రమే పనిచేస్తున్నారని, 332 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. కాంట్రాక్టు, పార్ట్‌టైమ్ ఉద్యోగులు, గెస్ట్ ఫ్యాకల్టీ సమస్యలపై ఇటీవల మంత్రులు, ప్రజాప్రతినిధులతో చర్చించినట్లు తెలిపారు. వర్సిటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాధ్యమైన మార్గాలను అన్వేషిస్తానన్నారు.ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత కూడా ఉద్యోగులు, విద్యార్థులు, అధ్యాపకులకు నిరంతరం అందుబాటులో ఉంటానని, వారి సమస్యలపై స్వతంత్రంగా గళం వినిపిస్తూ పరిష్కారం కోసం పోరాడుతానని హామీ ఇచ్చారు. తన తండ్రి టైగర్ దామోదర్ రెడ్డి, కుటుంబ సభ్యులు ప్రజల కోసం చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజల గుండెల్లో సంపాదించిన స్థానమే తమ కుటుంబానికి గొప్ప ఆస్తి అని పేర్కొన్నారు.

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షా భావ పరిస్థితులపై క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించిన కలెక్టర్

- **తక్కువ నీటి వినియోగంతో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలి.**
- **జిల్లా కలెక్టర్ ప్రియాంక.**

నారాయణపేట మండలం,నవంబర్,03(సమయం న్యూస్)

ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదల కారణంగా పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల పరిస్థితిని పరిశీలించారు.నారాయణపేట మండల పరిధిలోని అప్పక్‌పల్లి, చిన్నజట్రం, కొల్లంపల్లి గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్ ఆయా గ్రామాలకు చెందిన రైతుల పంట పొలాలను సందర్శించి వర్షాభావ పరిస్థితుల వల్ల దెబ్బతిన్న పంటలను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా అప్పక్‌పల్లి గ్రామానికి చెందిన రైతు సాగు చేసిన వరి, టమాట, మిరప పంటలను కలెక్టర్ పరిశీలించారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం, భూగర్భ జలమట్టం తగ్గిపోవడంతో బోర్లలో నీరు అడుగంటిపోయి పంటలకు సాగునీరు అందక పోవడంతో పంటలు ఎండిపోయిన పరిస్థితిని రైతు కలెక్టర్‌కు వివరించారు. ముఖ్యంగా వరి పంటకు అవసరమైన నీరు అందుబాటులో లేక పోవడంతో పంటను కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.తాను ఇతరుల భూమిని కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నానని, పంటల సాగు కోసం పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని రైతు తన ఆవేదనను కలెక్టర్‌కు వివరించారు. రైతు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న కలెక్టర్ విచారం వ్యక్తం చేస్తూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు.అనంతరం చిన్నజట్రం, కొల్లంపల్లి గ్రామాల్లో మరో ఇద్దరు రైతులు సాగు చేసిన వరి పంటలను కూడా కలెక్టర్ పరిశీలించారు. వర్షాలు లేకపోవడం, బోర్లలో నీటి లభ్యత తగ్గిపోవడంతో ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు. గత సంవత్సరం ఇదే సమయంలో వర్షపాతం ఎలా ఉందని, అప్పట్లో ఎంత విస్తీర్ణంలో పంటలు సాగు చేశారని, ప్రస్తుత పరిస్థితులతో పోలిస్తే దిగుబడులు, పెట్టుబడులు, ఆదాయంలో ఎంత తేడా వచ్చిందని రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు వర్షపాతంపై ప్రభావం చూపే అవకాశం ఉందని, వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో వ్యవసాయ రంగం సవాళ్లను ఎదుర్కొంటోందని కలెక్టర్ పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతోందని, బోర్లలో నీటి లభ్యత తగ్గిపోవడం వల్ల ముఖ్యంగా అధిక నీటి అవసరం ఉన్న పంటల సాగు రైతులకు భారంగా మారుతోందని తెలిపారు.రైతులు కేవలం వర్షాలపైనే ఆధారపడకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితి, నేల స్వభావం, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అధిక నీటి వినియోగం అవసరమయ్యే సంప్రదాయ పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని తెలిపారు.రైతులకు అండగా ఉండేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలివర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాల్లో పంటల పరిస్థితి, నీటి వనరుల లభ్యత, సాగు విస్తీర్ణం తదితర అంశాలను పరిశీలిస్తూ రైతులకు అవసరమైన వ్యవసాయ సలహాలు అందించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు నీటి పొదుపు పద్ధతులపై సూచనలు చేయాలని పేర్కొన్నారు.రైతులు ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల సాగులో తగిన మార్పులు చేసుకోవాలని, ప్రకృతి పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా పెట్టుబడి నష్టాలను తగ్గించుకునే ప్రయత్నం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు.జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం దృష్టి సారిస్తున్న నేపథ్యంలో రైతులకు సరైన సమయంలో వ్యవసాయ సలహాలు అందించడం, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయ రంగానికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, మండల వ్యవసాయ శాఖ అధికారి, ఏఈఓలు పాల్గొన్నారు.



పట్టభద్రుల పట్టాభిషేకానికి కాంగ్రెస్ సిద్ధం..

- **సర్వోత్తం రెడ్డి విజయమే లక్ష్యం... డిసిసి అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి**
- **4.58 లక్షలకు పైగా పట్టభద్రుల ఓటరు నమోదు.. కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం**
- **యువత, అధ్యాపకులు, మేధావులంతా ఏకతాటిపైకి రావాలి**

హనుమకొండ, నవంబర్ 3 (సమయం న్యూస్)



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీకి బలమైన ప్రజాబలం ఉందని, పట్టభద్రులు, యువత, అధ్యాపకులు, న్యాయవాదులు ఏకతాటిపైకి వచ్చి పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కోరారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా కాకతీయ విశ్వవిద్యాలయ యువజన విభాగం ఆధ్వర్యంలో మంగళవారం వర్సిటీ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పట్టభద్రులైన విద్యార్థులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులు, మేధావులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఆత్మీయ సమావేశం నిర్వహించిన కాకతీయ విశ్వవిద్యాలయ యువజన విభాగాన్ని అభినందించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఉన్నత విద్యావంతుడు, నాలుగు తరాలుగా కాంగ్రెస్ సిద్ధాంతాల కోసం నిలబడిన రాజకీయ కుటుంబ వారసుడు రాంరెడ్డి సర్వోత్తం రెడ్డిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడం గర్వకారణమన్నారు.నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో విశేష స్పందన లభించిందని తెలిపారు. ఫామ్ 18 ద్వారా మూడు జిల్లాల్లో 4.58 లక్షలకు పైగా పట్టభద్రులు ఓటర్లుగా నమోదు కావడం రికార్డుగా అభివర్ణించారు. హనుమకొండ జిల్లా నుంచే 43,997 మంది పట్టభద్రులు ఓటరుగా నమోదు కావడం కాంగ్రెస్ శ్రేణుల కృషికి నిదర్శనమన్నారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి నాయిని రాజేందర్ రెడ్డిని గెలిపించడం ద్వారా పట్టభద్రులు కాంగ్రెస్‌కు అండగా నిలిచారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని 34 అసెంబ్లీ స్థానాల్లో 32 స్థానాలకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తున్నారని గుర్తుచేశారు. ఇదే ఐక్యతను ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ చాటాలని, యువ పట్టభద్రులు, న్యాయవాదులు, అధ్యాపకులు, మేధావులు సర్వోత్తం రెడ్డికి మద్దతుగా నిలిచి భారీ మెజారిటీతో గెలిపించాలని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కోరారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, తెలంగాణ తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ వెంకట నారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ వరంగల్ డీసీసీ అధ్యక్షుడు ఎండీ అయూబ్ ఖాన్ హాజరయ్యారు.

కివీస్‌తో వన్డే సమరం.. నేడే తొలి పోరు!

- టీ20 సిరీస్ విజయంతో జోరుమీదున్న టీమిండియా
- ఆక్లాండ్ ఈడెన్ పార్క్‌లో భారత్-న్యూజిలాండ్ ఢీ
- జట్టులోకి రోహిత్, కోహ్లీ.. బ్యాటింగ్‌కు అదనపు బలం
- తొలి మూడు వన్డేలకు గిల్.. చివరి రెండింటికి అయ్యర్ సారథ్యం
- ఈడెన్ పార్క్‌లో భారత్‌కు సవాల్ విసురుతున్న గత రికార్డులు



ఆక్లాండ్, నవంబర్ 4 (సమయం న్యూస్): పొట్టి క్రికెట్‌లో న్యూజిలాండ్‌ను ఓడించిన భారత జట్టు ఇప్పుడు వన్డే సమరానికి సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3--2 తేడాతో కైవసం చేసుకున్న టీమిండియా అదే ఉత్సాహంతో వన్డే పోరులో అడుగుపెడుతోంది. భారత్, న్యూజిలాండ్ మధ్య ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ బుధవారం ఆక్లాండ్‌లోని చారిత్రాత్మక ఈడెన్ పార్క్ మైదానంలో జరగనుంది. టీ20ల్లో సాధించిన విజయాన్ని వన్డేల్లోనూ కొనసాగించాలని భారత జట్టు భావిస్తుండగా, సొంతగడ్డపై సిరీస్‌కు శుభారంభం ఇవ్వాలని న్యూజిలాండ్ పట్టుదలతో ఉంది. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తిరిగి జట్టులోకి రావడంతో భారత బ్యాటింగ్ విభాగం మరింత బలపడింది. ఈ వన్డే సిరీస్‌లో భారత జట్టుకు ఇద్దరు కెప్టెన్లు వ్యవహరించనుండటం ప్రత్యేకతగా నిలుస్తోంది. తొలి మూడు వన్డేలకు యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహించనుండగా, చివరి రెండు మ్యాచ్‌లకు శ్రేయస్ అయ్యర్ సారథ్య బాధ్యతలు చేపట్టనున్నారు. యువ ఆటగాళ్లతోపాటు అనుభవజ్ఞులైన క్రికెటర్లు జట్టులో ఉండటంతో భారత్ సమతూకంగా కనిపిస్తోంది. ముఖ్యంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రాకతో బ్యాటింగ్ విభాగంపై అంచనాలు పెరిగాయి. ఆరంభంలో రోహిత్ దూకుడుగా ఆడితే, మధ్య ఓవర్లలో కోహ్లీ ఇన్నింగ్స్‌ను నిలబెట్టే అవకాశం ఉంటుంది. వీరిద్దరి అనుభవం న్యూజిలాండ్ పరిస్థితుల్లో భారత్‌కు కీలకం కానుంది. ఈ సిరీస్‌లో రోహిత్ శర్మ ప్రదర్శనపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. అంతర్జాతీయ క్రికెట్‌లో భారీ సిక్సర్లు బాదడంలో ప్రత్యేక గుర్తింపు పొందిన రోహిత్ మరో మైలురాయికి చేరువలో ఉన్నాడు. న్యూజిలాండ్ గడ్డపై సెంచరీ సాధిస్తే వయసు పరంగా అరుదైన ఘనత అందుకునే అవకాశమూ ఉంది. అయితే వ్యక్తిగత రికార్డులకంటే జట్టు విజయమే ముఖ్యమని భారత అభిమానులు ఆశిస్తున్నారు. మరోవైపు విరాట్ కోహ్లీ కూడా తన అనుభవంతో కీలక ఇన్నింగ్స్ ఆడాలని భావిస్తున్నాడు. తొలి మ్యాచ్‌కు వేదికైన ఈడెన్ పార్క్ మైదానంలో భారత్ గత రికార్డులు అంత ఆశాజనకంగా లేవు. ఇక్కడ ఇప్పటివరకు ఆడిన 11 వన్డేల్లో భారత్ నాలుగింట మాత్రమే విజయం సాధించగా, ఆరు మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసింది. మరో మ్యాచ్ టైగా ముగిసింది. ఈ నేపథ్యంలో పాత రికార్డులను అధిగమించి విజయంతో సిరీస్‌ను ప్రారంభించడం టీమిండియాకు సవాల్‌గా మారనుంది. న్యూజిలాండ్ మైదానాల్లో బంతి కదలిక, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా బ్యాటర్లు తమ ఆటతీరును మార్చుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఆరంభ ఓవర్లలో వికెట్లు కోల్పోకుండా నిలబడటం భారత విజయావకాశాలను ప్రభావితం చేయనుంది. మిచెల్ సాంట్నర్ నాయకత్వంలోని న్యూజిలాండ్ జట్టును తక్కువ అంచనా వేయలేము. సొంత మైదానాలపై మంచి అవగాహన కలిగిన కివీస్ ఆటగాళ్లు భారత బ్యాటర్లకు గట్టి సవాల్ విసిరే అవకాశం ఉంది. టీ20 సిరీస్ ఓటమి తర్వాత వన్డేల్లో పుంజుకోవాలని ఆతిథ్య జట్టు భావిస్తోంది. బౌలింగ్‌లో క్రమశిక్షణతోపాటు చురుకైన క్షేత్రరక్షణ న్యూజిలాండ్‌కు ప్రధాన బలాలు. భారత బ్యాటింగ్ విభాగాన్ని త్వరగా కట్టడి చేయడంపైనే ఆ జట్టు దృష్టి సారించనుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి పోరు రెండు జట్లకూ కీలకం కానుంది. ప్రారంభ మ్యాచ్‌లో విజయం సాధిస్తే మిగిలిన పోరులకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమయ్యే అవకాశం ఉంటుంది. భారత్‌కు సీనియర్ ఆటగాళ్ల అనుభవం అండగా ఉండగా, న్యూజిలాండ్‌కు సొంతగడ్డ పరిస్థితులు అనుకూలంగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో రెండు జట్ల మధ్య ఆసక్తికర పోరు జరిగే అవకాశముంది. న్యూజిలాండ్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3 గంటలకు, భారత కాలమానం ప్రకారం ఉదయం 7.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఒకవైపు రోహిత్, కోహ్లీ అనుభవం.. మరోవైపు గిల్ యువ నాయకత్వం.. సొంతగడ్డపై సాంట్నర్ సేన సవాల్! తొలి వన్డేలో ఎవరు పైచేయి సాధిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.



పంజాబ్ కింగ్స్ భారీ స్కెచ్

ముంబై నుంచి హార్దిక్ పాండ్యా కోసం ఆ ఇద్దరు ఆటగాళ్ల ట్రేడ్ డీల్!

ముంబై, నవంబర్ 3 (సమయం న్యూస్): ఐపీఎల్ 2027 సీజన్ ప్రారంభానికి ముందే లీగ్‌లో ఓ భారీ సంచలనానికి తెరలేచే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత స్టార్ ఆల్‌రౌండర్, ముంబై ఇండియన్స్ ఆటగాడు హార్దిక్ పాండ్యా ఫ్రాంచైజీ మారే దిశగా అడుగులు వేస్తున్నట్లు క్రీడా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్ 2027కి ముందు హార్దిక్‌ను తమ జట్టులోకి తీసుకునేందుకు పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ ముంబై ఇండియన్స్‌తో తీవ్రస్థాయిలో ట్రేడ్ చర్చలు జరుపుతున్నట్లు ప్రముఖ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సంచలన ట్రేడ్ డీల్‌లో భాగంగా హార్దిక్ పాండ్యాను దక్కించుకునేందుకు పంజాబ్ కింగ్స్ తమ స్టార్ ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్‌తో పాటు యువ వికెట్ కీపర్-బ్యాటర్ విష్ణు వినోద్‌లను ముంబై ఇండియన్స్‌కు ఇచ్చే ప్రతిపాదనను తెరపైకి తెచ్చినట్లు సమాచారం. ముంబై జట్టు బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు పంజాబ్ టాప్ వికెట్ టేకర్ అర్ష్‌దీప్‌ను తీసుకోవడానికి ముంబై మేనేజ్‌మెంట్ కూడా సుముఖంగా ఉన్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. పంజాబ్ హెడ్ కోచ్ రికీ పాంటింగ్ ఈ ట్రేడ్ చర్చలను ముందుకు తీసుకెళ్లడంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని, ఇరు జట్ల సీనియర్ మేనేజ్‌మెంట్లు ఈ ఒప్పందానికి దాదాపు అంగీకారానికి వచ్చినట్లు తెలుస్తోంది. హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్ జట్టులోకి వస్తే మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్‌తో పాటు డెత్ ఓవర్ల బౌలింగ్‌లో జట్టుకు అపారమైన బలం చేకూరుతుంది. అయితే ప్రధాన బౌలర్ అర్ష్‌దీప్‌ను కోల్పోవడం పంజాబ్ పేస్ విభాగానికి కొంత లోటే అయినప్పటికీ, ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనను సమర్థవంతంగా వాడుకునే వ్యూహంతో పంజాబ్ మేనేజ్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2027 రిటెన్షన్ గడువు నవంబర్ 17 కావడంతో, ఈ డీల్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనను ఐపీఎల్ వర్గాలు ఈ వారంలోనే వెల్లడించే అవకాశాలు ఉన్నాయని నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ వార్తపై ఇరు ఫ్రాంచైజీల నుంచి ఇంకా అధికారిక ధృవీకరణ వెలువడాల్సి ఉంది.

కాలికి గాయమైనా వీరోచిత పోరాటం

- 128 బంతుల్లో అజేయంగా 201 పరుగులు.. 21 ఫోర్లు, 10 సిక్సర్లతో విధ్వంసం
- అఫ్గానిస్థాన్‌పై వాంఖడే మైదానంలో అసాధారణ పోరాటం
- అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు నేపథ్యంలో మళ్లీ చర్చకు వచ్చిన చారిత్రక ద్విశతకం



మెల్‌బోర్న్, నవంబర్ 3 (సమయం న్యూస్) : మైదానంలో తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించిన ఆస్ట్రేలియా స్టార్ ఆల్ రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. 38 ఏళ్ల వయసులో మాక్స్‌వెల్ సంచలన రీతిలో తీసుకున్న ఈ రిటైర్మెంట్ నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. నిజానికి 2028 టీ20 వరల్డ్ కప్, లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో ఆస్ట్రేలియా తరఫున ప్రతినిధ్యం వహించాలని ఆయన భావించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలకాలని నిశ్చయించుకున్నారు. ఈ సందర్భంగా క్రికెట్ ప్రపంచం ఎప్పటికీ మరచిపోలేని ఆయన వీరోచిత ఇన్నింగ్స్ గురించి సోషల్ మీడియాలో క్రీడాభిమానులు ఘనంగా స్మరించుకుంటున్నారు. ముంబైలోని చారిత్రాత్మక వాంఖడే స్టేడియం వేదికగా 2023 వన్డే వరల్డ్ కప్‌లో అఫ్గానిస్తాన్‌తో జరిగిన పోరు వన్డే చరిత్రలోనే అత్యుత్తమ మ్యాచ్‌గా నిలిచింది. ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా కేవలం 91 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి ఘోర ఓటమి అంచున నిలిచింది. ఆ దశలో క్రీజులోకి వచ్చిన మాక్స్‌వెల్ తీవ్రమైన కండరాల నొప్పులు (క్రాంప్స్), కాలి గాయంతో నడవలేని పరిస్థితి ఏర్పడినప్పటికీ మైదానంలో పట్టుదలతో నిలబడి అఫ్గాన్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. కేవలం 128 బంతుల్లోనే 21 ఫోర్లు, 10 సిక్సర్లతో 201 పరుగులు చేసి అజేయంగా నిలిచి ఆసీస్‌కు 3 వికెట్ల తేడాతో విస్మయకర విజయాన్ని అందించారు. ఈ చారిత్రాత్మక ఇన్నింగ్స్ తోడ్పాటుతోనే ఆస్ట్రేలియా ఆ ఏడాది వరల్డ్ కప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. గ్లెన్ మాక్స్‌వెల్ అంతర్జాతీయ క్రికెట్‌లోని 3 ఫార్మాట్లలోనూ తనదైన ముద్ర వేశారు. టెస్టుల్లో 7 మ్యాచ్‌లు ఆడి ఒక సెంచరీతో 339 పరుగులు చేయగా, 8 వికెట్లు పడగొట్టారు. ఇక 149 వన్డేల్లో 126.70 స్ట్రైక్ రేట్‌తో 4 సెంచరీలు, 23 హాఫ్ సెంచరీలతో 3990 పరుగులు సాధించడంతో పాటు 77 వికెట్లు తీశారు. 2015, 2023 వన్డే వరల్డ్ కప్‌లు గెలిచిన ఆసీస్ జట్టులో ఆయన అత్యంత కీలక పాత్ర పోషించారు. 130 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 154.42 స్ట్రైక్ రేట్‌తో 5 సెంచరీలు, 12 హాఫ్ సెంచరీల సాయంతో 2897 పరుగులు చేయడంతో పాటు 51 వికెట్లు తీశారు. అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై చెప్పినప్పటికీ వివిధ దేశాల ఫ్రాంచైజీ లీగ్ క్రికెట్‌లో ఆయన కొనసాగుతారా లేదా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.



డయానా గ్రేస్‌కు 3 పతకాలు

హైదరాబాద్: సీబీఎస్ఈ జాతీయ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ జిమ్నాస్ట్ డయానా గ్రేస్ అద్భుత ప్రదర్శనతో ఒక స్వర్ణం, రెండు కాంస్య పతకాలను సాధించింది. పుణెలో జరిగిన ఈ టోర్నీ అండర్-19 విభాగంలో పోటీపడిన డయానా (కార్నర్‌స్టోన్ స్కూల్) ఇండివిజువల్ ఆపరేటస్ బీమ్ ఈవెంట్‌లో 9.45 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచి పసిడి పతకం సొంతం చేసుకుంది. అన్‌ఈవెన్ బార్ (7.25), ఆల్‌రౌండ్ (34.05) విభాగాల్లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాలను ఖాతాలో వేసుకుంది.

కొరియా ఓపెన్‌కు లక్ష్యసేన్ దూరం



యోసు (సౌత్ కొరియా): రెండ్రోజుల క్రితం ముగిసిన హైలో ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో మెన్స్ సింగిల్స్ టైటిల్ గెలుచుకున్న భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్.. మంగళవారం నుంచి దక్షిణ కొరియాలో మొదలుకానున్న బీడబ్ల్యూఎఫ్ కొరియా సూపర్ 500 టోర్నమెంట్‌కు దూరమయ్యాడు. ఐదో సీడ్‌గా ఉన్న అతడు తప్పుకోవడంతో ఈ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో భారత ఆశలన్నీ సీనియర్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ పై ఉన్నాయి. తొలిరౌండ్‌లో అతడు లోకల్ ప్లేయర్ యొ టెబిన్‌తో తలపడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో మాళవిక కూడా టోర్నీకి దూరమైంది. అన్మోల్ ఖర్బ్, తన్వి శర్మ విమెన్స్ సింగిల్స్ బరిలో ఉన్నారు. కొరియా ఓపెన్‌తో పాటు జపాన్ మాస్టర్స్ నుంచి సింధు ముందే తప్పుకుంది.

అజేయంగా సెమీస్‌కు..

భారత్ ఖాతాలో ఐదో విజయం



జలంధర్: సొంతగడ్డపై జరుగుతున్న హాకీ ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో ఓటమన్నదే లేకుండా ఆడుతున్న భారత జట్టు ఖాతాలో మరో విజయం. లీగ్ దశలో భాగంగా సోమవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో భారత్.. 8-0తో దక్షిణ కొరియాను చిత్తుచేసి అజేయంగా సెమీస్‌కు చేరుకుంది. గ్రూప్ దశలో మొదట బంగ్లాదేశ్‌పై 13-0తో టైటిల్ వేటను ఆరంభించిన హర్మన్‌ప్రీత్ సింగ్ సేన ఆ తర్వాత చైనా, జపాన్, మలేషియాపై విజయాలు నమోదుచేసింది. కొరియాతో పోరులో స్ట్రైకర్ దిల్‌ప్రీత్ సింగ్ (8, 40వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా జుగ్‌రాజ్ సింగ్ (11), హర్మన్‌ప్రీత్‌సింగ్ (15), షీలానంద్ (33), సుఖ్‌జీత్ (34), సంజయ్ (36), అంగద్ (60) చెరో గోల్స్‌తో చెలరేగారు. లీగ్ స్టేజ్‌లో ఆడిన ఐదు మ్యాచుల్లోనూ గెలిచిన భారత్.. పాయింట్ల పట్టికలో 15 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. బుధవారం జరుగబోయే రెండో సెమీ-స్‌లో కొ రియాతోనే భారత్ నాకౌట్ మ్యాచ్ ఆడనుంది.



'రామాయణ'కు పైరసీ భయం

కీలక ఆదేశాలు జారీ చేసిన ముంబై హైకోర్టు!

ముంబై, నవంబర్ 3 (సమయం న్యూస్): భారతీయ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ చిత్రం 'రామాయణ'. బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తున్న ఈ చిత్రానికి నితీశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. అత్యంత భారీ బడ్జెట్‌తో, అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలతో రూపొందుతున్న ఈ సినిమాను రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. తొలి భాగాన్ని దీపావళి కానుకగా విడుదల చేసేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన దృశ్యాలు, వీడియో క్లిప్పులు బయటకు రాకుండా నిర్మాతలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న సినిమాలకు పైరసీ పెద్ద సమస్యగా మారుతోంది. థియేటర్లలో విడుదలకు ముందే సినిమా దృశ్యాలు, పాటలు, కీలక సన్నివేశాలు సామాజిక మాధ్యమాల్లో లీక్ అయితే చిత్ర బృందానికి నష్టం కలిగే అవకాశం ఉంటుంది. ఈ సమస్యను ముందుగానే అడ్డుకునేందుకు 'రామాయణ' నిర్మాతలు న్యాయపరమైన చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ముంబై హైకోర్టు సినిమా పైరసీ, అనధికారిక వీడియో క్లిప్పుల ప్రచారాన్ని అడ్డుకునేందుకు ప్రత్యేకంగా డైనమిక్ ఇంజంక్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. సినిమా పేరుతో అనధికారికంగా లింకులు, వీడియోలు, క్లిప్పులు అప్‌లోడ్ చేసే వెబ్‌సైట్లు, ఇతర వేదికలపై చర్యలు తీసుకునేందుకు ఈ ఉత్తర్వులు ఉపయోగపడనున్నాయి. డిసెంబర్ మధ్య వరకు 'రామాయణ'కు సంబంధించిన పైరసీ లింకులు, అనధికారిక కంటెంట్ వ్యాప్తిని నియంత్రించేందుకు ఈ ఆదేశాలు తోడ్పడనున్నాయి. భారీ పెట్టుబడితో రూపొందుతున్న సినిమాను పైరసీ నుంచి రక్షించుకోవడంలో నిర్మాతలు తీసుకున్న ఈ చర్యకు ప్రాధాన్యత ఏర్పడింది. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రామాయణ'లో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా కనిపించనున్నారు. కన్నడ స్టార్ యష్ రావణుడి పాత్ర పోషిస్తున్నారు. ఈ ముగ్గురు ప్రముఖ నటులు ఒకే చిత్రంలో భాగం కావడంతో మొదటి నుంచే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్‌తో పాటు ప్రముఖ హాలీవుడ్ సంగీత దర్శకుడు హన్స్ జిమ్మర్ సంగీతం అందిస్తున్నారు. భారతీయ పురాణ గాథను ప్రపంచ ప్రేక్షకులకు చేరువ చేసేలా భారీ సాంకేతిక హంగులతో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. నమిత్ మల్హోత్రా నిర్మాణ బాధ్యతలు చేపట్టగా, యష్ కూడా నిర్మాణంలో భాగస్వామిగా ఉన్నారు..



ఇకపై ఆచితూచి మాట్లాడుతా..

నా మాటల భావనలో లోపాలను సరిదిద్దుకుంటా: నటి సాయిపల్లవి!

హైదరాబాద్, నవంబర్ 3 (సమయం న్యూస్) : తన సహజ నటనతో అశేష ప్రేక్షకాభిమానులను సొంతం చేసుకున్న ప్రముఖ కథానాయిక సాయిపల్లవి తన ప్రసంగాలు, మాటల శైలిపై కీలక ప్రకటన చేశారు. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటూ 'ఫిదా', 'లవ్ స్టోరీ', 'శ్యామ్ సింగరాయ్', 'విరాటపర్వం', 'తండేల్' వంటి చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ, గతంలో పలు సందర్భాల్లో చేసిన వ్యాఖ్యలు వివాదాలకు దారితీసిన విషయం తెలిసిందే. 'విరాటపర్వం' ప్రమోషన్లలో కశ్మీరీ పండిట్ల అంశం, భారత సైన్యంపై చేసిన పాత వ్యాఖ్యలు, అలాగే ఇటీవల 'రామాయణ' చిత్రంలో రావణుడి పాత్రపై ఆమె చేసిన తాత్విక కామెంట్స్ సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన సాయిపల్లవి.. ఇకపై తాను ప్రతి మాటను ఆచితూచి మాట్లాడతానని స్పష్టం చేశారు. తన మనసులో ఉన్న భావాలను ఇతరులకు స్పష్టంగా అర్థమయ్యేలా చెప్పడంలో తనకు కొంత ఇబ్బంది ఉందని, మాటల రూపంలో సరిగ్గా వ్యక్తపరచలేకపోవడం వల్ల తాను చెప్పాలనుకున్న దానికి భిన్నమైన అర్థాలు వస్తున్నాయని నిజాయితీగా అంగీకరించారు. ఒక నటిగా తనకు లభించే గుర్తింపు కారణంగా ప్రతి మాటకు సమాజంలో పెద్ద ఎత్తున ప్రచారం లభిస్తుందని, అందువల్ల ఇకపై మాట్లాడే విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. తన భావాలను సరిగ్గా వ్యక్తపరిచే నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటానని చెప్పిన ఆమె వ్యాఖ్యలు ప్రస్తుతం ఫిలిం వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

తెల్లగా ఉంటే చాలు.. తెలుగు అక్కర్లేదు

టాలీవుడ్ పరిస్థితిపై రాధికా ఆప్టే సంచలన వ్యాఖ్యలు!



హైదరాబాద్, నవంబర్ 3 (సమయం న్యూస్) : బాలీవుడ్ నటి రాధికా ఆప్టే తెలుగు చలనచిత్ర పరిశ్రమలో హీరోయిన్ల ఎంపిక, కథాంశాల తీరుపై చేసిన సంచలన వ్యాఖ్యలు ప్రస్తుతం టాలీవుడ్‌లో తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. తెల్లగా ఉంటే చాలు, తెలుగు భాష రాకపోయినా, భాషతో సంబంధం లేకుండా హీరోయిన్లుగా తీసేసుకుంటారనే కోణంలో టాలీవుడ్ పరిస్థితులపై ఆమె అసహనం వ్యక్తం చేసిన తీరు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. కీర్తి సురేష్‌తో కలిసి నటించిన క్రైమ్ థ్రిల్లర్ వెబ్‌సిరీస్ 'అక్కా' ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె, తన గత తెలుగు సినిమాల అనుభవాలను గుర్తుచేసుకుంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలుగులో తాను నటించిన ఓ సినిమాలో తనకంటే చాలా పెద్ద వయసున్న నటుడితో రొమాన్స్ చేయాల్సి వచ్చిందని, అంతేకాకుండా సొంత మేనబావను పెళ్లి చేసుకునే సన్నివేశాలు ఉన్నాయని చెప్పారు. అంతటితో ఆగకుండా సినిమా మధ్యలోనే తన పాత్రను చంపేశారంటూ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆమె నేరుగా సినిమా పేరును వెల్లడించనప్పటికీ, ఈ వ్యాఖ్యలు నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన 'లెజెండ్' (2014) సినిమాను ఉద్దేశించినవేనని సినీ ప్రియులు అభిప్రాయపడుతున్నారు. ఆ చిత్రంలో రాధికా ఆప్టే బాలకృష్ణకు మరదలి పాత్రలో నటించగా, కథలోని ఫ్లాష్‌బ్యాక్‌లోనే ఆమె పాత్ర హత్యకు గురవుతుంది. ఈ వ్యాఖ్యలు బయటకు రావడంతో సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు, నందమూరి అభిమానులు ఆమెకు ఘాటుగా కౌంటర్లు ఇస్తున్నారు. కథ, పాత్ర స్వభావం నచ్చనప్పుడు సినిమాను అంగీకరించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తున్నారు. అడ్వాన్స్ తీసుకుని సైన్ చేసేటప్పుడే ఇవన్నీ తెలుస్తాయి కదా అని నిలదీస్తున్నారు. దక్షిణ భారతదేశంలో మేనరికపు వివాహాలు సంప్రదాయంలో భాగమని, స్థానిక సంస్కృతులను కథల్లో చూపించడం సహజమని స్పష్టం చేస్తున్నారు. ప్రతిదాన్ని విమర్శించడం సరికాదని కొందరు కౌంటర్ ఇస్తుంటే, మహిళా పాత్రల ప్రాధాన్యతపై నటీమణులు తమ అభిప్రాయాలు చెప్పడంలో తప్పులేదని మరికొందరు సపోర్ట్ చేస్తున్నారు.



నాగార్జున 100వ సినిమాలో టబు స్పెషల్ రోల్

హైదరాబాద్, నవంబర్ 3 (సమయం న్యూస్) : కింగ్ నాగార్జున, అందాల నటి టబు కాంబినేషన్‌కు తెలుగు సినీ పరిశ్రమలో అత్యంత ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. వీరిద్దరూ కలిసి నటించిన 'నిన్నే పెళ్లాడతా' చిత్రం అప్పట్లో పరిశ్రమ రికార్డులను తిరగరాయడమే కాకుండా, ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసింది. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీకి టాలీవుడ్‌లో తిరుగులేని ఆదరణ లభించింది. చాలా కాలం తర్వాత ఈ క్రేజీ ఐకానిక్ జోడీ మరోసారి వెండితెరపై కలిసి కనిపిస్తుండటంతో సినీ అభిమానుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. నాగార్జున నటిస్తున్న ప్రతిష్ఠాత్మక 100వ మైలురాయి చిత్రం 'కింగ్ 100' లో టబు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా ద్వారా ప్రేక్షకులు మరోసారి ఈ అరుదైన జోడీని తెరపై చూడబోతున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొనగా, తాజాగా చిత్ర బృందం టబు పాత్రకు సంబంధించిన ప్రత్యేక అప్‌డేట్‌ను అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాలో టబు పాత్రకు సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌ను నవంబర్ 4న ఉదయం 9 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ ప్రకటనతో అక్కినేని అభిమానుల్లో మరింత ఉత్సాహం నిండింది. ఆర్. కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకు స్వరాలు సమకూరుస్తున్నారు. నాగార్జున కెరీర్‌లో ఇది 100వ మైలురాయి చిత్రం కావడంతో ఈ ప్రాజెక్ట్‌కు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ చిత్రాన్ని 2026 డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా థియేటర్లలో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దశాబ్దాల తర్వాత నాగార్జున, టబు జోడీ మళ్లీ కలవడం, అది కూడా 100వ సినిమా కావడంతో ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

PRINTED AND PUBLIAHED BY **MOHAMMED MURTHUZA,** 1-2-524/3/B, ROOM NO. 110, 1ST FLOOR, SAGAR VIEW COMPLEX, DOMALGUDA, HYDERABAD, TELANGANA - 500080, ON BEHALF OF MOHAMMED MURTHUZA, EDITED BY MOHAMMED MURTHUZA, PRINTED BY JAKKULA NARENDER, AT VISION ANDHRA, 2-1-340/A/4, NEAR FEVER HOSPITAL, O.U.ROAD, NALLAKUNTA, HYDERABAD, TELANGANA - 500044. **PRGI NUMBER APTEL/2006/18267.** PHONE:**7036644111, 9490140565**

పట్టభద్రుల తీర్పే విద్యారంగ భవిష్యత్తుకు దిక్సూచి.!

- విద్యావంతుల ఆశయాలకు ప్రతినిధిగా సర్వోత్తం రెడ్డి నిలవాలి
- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రాధాన్యతను వివరించిన ఎమ్మెల్యే 'కేఆర్ నాగరాజు'

హనుమకొండ, నవంబర్ 3 (సమయం న్యూస్)



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు విద్యావంతుల గొంతుకను చట్టసభల్లో వినిపించేందుకు ఎంతో కీలకమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. విద్యారంగ అభివృద్ధి, నిరుద్యోగ యువత సమస్యలు, ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతం వంటి అంశాలపై సమర్థవంతంగా గళమెత్తే నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన బాధ్యత పట్టభద్రులపై ఉందని పేర్కొన్నారు.కాకతీయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టభద్రులు, అధ్యాపకులు, విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఎంతో విలువైనదని, ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు ఎన్నికల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆలోచించి సరైన అభ్యర్థిని ఎన్నుకోవడం ద్వారా విద్యారంగ అభివృద్ధికి, యువత భవిష్యత్తుకు మేలు జరుగుతుందని అన్నారు.ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డికి పట్టభద్రులు, అధ్యాపకులు, విద్యార్థులు మద్దతు తెలిపి ఆయన విజయానికి కృషి చేయాలని కోరారు. విద్యావంతులు, యువత భాగస్వామ్యంతో ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయాలని, విద్యారంగ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే నాగరాజు పిలుపునిచ్చారు.సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డితో పాటు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, తెలంగాణ తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, కుడా చైర్మన్ గుండు సుధారాణి, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు ఎండీ అయూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ వ్యవస్థలపై బురదజల్లితే సహించేది లేదు

- ప్రజాస్వామ్య పరిరక్షణకు మేధావులు, యువత నడుం బిగించాలి
- ఓటర్ల సమగ్ర సవరణపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి..
- బూత్ స్థాయిలో సమస్యలు పరిష్కరించుకోకుండా ఢిల్లీకి వెళ్లి రాజకీయం ఎందుకు?
- ప్రముఖ న్యాయవాది కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

వరంగల్, నవంబర్ 3 (సమయం న్యూస్ :



ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ అరాచక శక్తుల ఆగడాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రముఖ న్యాయవాది కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. వరంగల్ చౌరస్తాలోని కే కన్వెన్షన్‌లో మంగళవారం 'సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ' ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం.. అరాచక శక్తులను తరిమికొడదాం' అనే అంశంపై మేధావుల సదస్సు నిర్వహించారు. కుసుమ సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు.కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలపై విమర్శలు చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియ చట్టబద్ధంగా పూర్తయిన తర్వాతే కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. ఆయా రాష్ట్రాల్లో అభ్యంతరం వ్యక్తం చేయని కాంగ్రెస్ నేతలు తెలంగాణలో మాత్రం అదే ప్రక్రియపై ప్రశ్నలు లేవనెత్తడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పులు, అభ్యంతరాలు ఉంటే క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న బూత్ స్థాయి అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవచ్చని అన్నారు.అలా కాకుండా ప్రతి అంశాన్ని రాజకీయంగా మలుచుకుంటూ ఢిల్లీకి వెళ్లడం వెనుక ఉద్దేశమేంటని ప్రశ్నించారు. యువతను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటూ రాజ్యాంగ వ్యవస్థలపై వ్యతిరేకత పెంచే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు.ప్రజాస్వామ్య పరిరక్షణకు మేధావులు, విద్యావంతులు, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు నమోదు, ఓటర్ల జాబితా పరిశీలనను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు.ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సదస్సులో వరంగల్ నగరానికి చెందిన పలువురు మేధావులు, న్యాయవాదులు, విద్యాసంస్థల ప్రతినిధులు, ప్రజాస్వామ్యవాదులు పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

దూడలకు ఉచితంగా నట్టల నివారణ మందుల పంపిణీ

- టుంగుటూర్ గ్రామంలో 89 దూడలకు నట్టల నివారణ చికిత్స

ఆలేరు, నవంబర్ 03(సమయం న్యూస్)



ఆలేరు మండలం టుంగుటూర్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో దూడల నట్టల నివారణ (డీవార్మింగ్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ జుకంటి అనిల్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పశుపోషకులకు దూడల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ యాకూబ్ మాట్లాడుతూ దూడల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు నట్టల నివారణ మందులు ఎంతో కీలకమని తెలిపారు. దూడల శరీరంలో నట్టలు ఉండటం వల్ల వాటి ఎదుగుదల మందగించడంతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. నిర్ణీత సమయంలో పశువైద్యుల సూచనల మేరకు నట్టల నివారణ మందులు వేయించడం ద్వారా దూడలు ఆరోగ్యంగా పెరిగి, పశుసంపద అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు. పశుపోషకులు తమ పశువుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన మొత్తం 89 దూడలకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేసినట్లు పశువైద్యాధికారి తెలిపారు. పశుసంవర్ధక శాఖ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ భూపల్లి అక్షయ, గ్రామ కార్యదర్శి నరేందర్, పశువైద్యాధికారి డాక్టర్ యాకూబ్, జేవీఓ నరసింహ, గోపాలమిత్రులు సుధాకర్, శ్రీకాంత్, గోపి, గ్రామ రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే మరో ఉద్యమం తప్పదు

- ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యమకారుల హెచ్చరిక
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమకారుల అభ్యర్థిని బరిలో నిలుపుతాం: ఇక్కిరి శ్రీనివాస్, జంపాల శ్రీనివాస్

ఆలేరు, అక్టోబర్ 3(సమయం న్యూస్)



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని, లేనిపక్షంలో మరో ఉద్యమానికి సిద్ధం కావాల్సి వస్తుందని తెలంగాణ ఉద్యమకారుల మండల కోకన్వీనర్ ఇక్కిరి శ్రీనివాస్, కోశాధికారి జంపాల శ్రీనివాస్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆలేరు పట్టణంలోని క్రాంతినగర్‌లో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్నప్పటికీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలులో జాప్యం జరుగుతుండటం విచారకరమన్నారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ హామీలను అమలుకు నోచుకోకుండా చేస్తోందని విమర్శించారు. ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి వారికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. అమరవీరుల ప్రాణత్యాగాలు, ఉద్యమకారుల ధైర్యసాహసాలు, వీరోచిత పోరాటాల ఫలితంగానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాకారమైందని గుర్తుచేశారు. అలాంటి ఉద్యమకారులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఉద్యమకారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమకారులంతా ఏకమై మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. రాబోయే రెండు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల్లో మహబూబ్‌నగర్, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఉద్యమకారుల అభ్యర్థులను బరిలో నిలిపే అంశంపై ముందుకు సాగుతామని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉద్యమకారులందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మలిదశ తెలంగాణ ఉద్యమ నాయకులు ఎర్ర జాన్సన్, మొరిగాడి అశోక్, చెక్క వెంకటేష్, బడుగు కృష్ణ పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలి

- ఆలేరులో మండల స్థాయి క్రీడోత్సవాలు నిర్వహణ
- దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు: ఎంఈఓ ఎర్ర లక్ష్మి

ఆలేరు, నవంబర్ 03(సమయం న్యూస్):



దివ్యాంగ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు మండల స్థాయి క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి ఎర్ర లక్ష్మి అన్నారు. మంగళవారం ఆలేరు మండల భవిత కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేకంగా క్రీడా పోటీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి (ఎంఈఓ) ఎర్ర లక్ష్మి మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు నేడు విద్య, క్రీడలు, ఉద్యోగాలు తదితర అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటున్నారని అన్నారు. క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక, భావోద్వేగ వికాసానికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. దివ్యాంగ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అండగా నిలుస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ప్రభుత్వం సైతం దివ్యాంగుల కోసం అనేక విద్యా, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోందని తెలిపారు. దివ్యాంగుల హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, సమాజంలో వారికి సముచిత స్థానం కల్పిస్తూ అన్ని విధాలా చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలు, పాటలతో పాటు వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులను సాధించారు. నిర్వాహకులు విజేతలను అభినందించారు. ఈ నెల 6వ తేదీ శుక్రవారం నిర్వహించనున్న జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో భవిత కేంద్రం విద్యార్థులతో పాటు మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులందరూ పాల్గొనాలని ఆమె ఆహ్వానించారు. విద్యార్థులు తమ ప్రతిభను జిల్లా స్థాయిలో కూడా చాటుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీ శ్రీనివాస్, స్పెషల్ ఎస్‌జీటీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో పోలీసుల అవగాహన

ఆదిలాబాద్, నవంబర్ 03:(సమయం న్యూస్.)

చెరువుగూడలో నిర్వహించిన "పోలీసు మీకోసం" కార్యక్రమంలో ఆరు గ్రామాల ప్రజలకు ఆరు విభాగాల వైద్య నిపుణులతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300 మంది పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ మాట్లాడుతూ మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని, గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. చదువే జీవితాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధమని పేర్కొంటూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మహిళలు, విద్యార్థినులు సమస్యలపై డయల్ 112ను సంప్రదించాలని, బాల్య వివాహాలను అరికట్టాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. కంటి సమస్యలున్న వారికి ఉచిత శస్త్రచికిత్సలు అందిస్తామని ఎస్పీ తెలిపారు.



జలసిరితో ప్రతి వర్షపు చుక్కను ఒడిసిపట్టాలి

- ఇంటికో ఇంకుడు గుంత.. ప్రతి పొలానికీ పంటకుంట
- జలసిరితో ప్రతి వర్షపు చుక్కను ఒడిసిపట్టాలి
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ నవంబర్03(సమయం న్యూస్)

కొత్తపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పర్యటించి ఇంకుడు గుంతలు, పంట కుంటలను పరిశీలించారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత, ప్రతి పొలంలో పంటకుంట నిర్మించడం ద్వారా భూగర్భ జలాలను పెంచి భవిష్యత్తులో నీటి ఎద్దడిని నివారించవచ్చని తెలిపారు.జలసిరి కార్యక్రమం ద్వారా వర్షపు నీటిని ఒడిసిపట్టి నీటి వనరులను పెంపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో నేపథ్యంలో ఇంకుడు గుంతలు, పంట కుంటలు, బోరు బావుల రీచార్జి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలు, రైతులు ఈ పనుల నిర్మాణానికి ముందుకు రావాలని, సర్పంచులు, ప్రజాప్రతినిధులు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు.అనంతరం ఆసిఫ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలు, మందుల లభ్యతను పరిశీలించారు. ఎలగందులలో తెలంగాణ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యా ప్రమాణాలు, వసతులు, పారిశుధ్యంపై సమీక్షించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణానికి అవసరమైన భూ కేటాయింపులను వారం రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో పారిశుధ్యం మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, మరమ్మతులపై నివేదిక సమర్పించాలని సూచించారు.

భువనగిరి, వలిగొండ బస్టాండ్‌ల అభివృద్ధితో పాటు అదనపు బస్సులు

- మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి.

వలిగొండ నవంబర్ 03 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ కుంభం అనిల్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి భువనగిరి, వలిగొండ బస్టాండ్‌లను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గంలో అదనపు బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. నియోజకవర్గంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరిచి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ఎల్ఓసి చెక్కు అందజేసిన స్థానిక ఎమ్మెల్యే

- కుంభం అనిల్ కుమార్ రెడ్డి.

వలిగొండ నవంబర్ 03 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం మొగిలిపాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు జడిగే వెంకన్న భార్య జడిగే పద్మ కి మంజూరైన రూ. 2,50,000/ (రెండు లక్షల యాభై వేల రూపాయలు ఎల్వోసి చెక్కును భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి తమ చేతుల మీదుగా అందజేశారు.కష్ట సమయాల్లో గ్రామానికి అండగా నిలుస్తూ ఎంతో మందికి పునర్జన్మ నిస్తున్న భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి మొగిలిపాక గ్రామం తరపున, గ్రామ ప్రజల తరపున ప్రత్యేక హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పబ్బు ఎల్లయ్య గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దసాని రాంచంద్ర రెడ్డి పులిపల్పుల రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మెదక్‌లో బియ్యం దుకాణాలపై తనిఖీలు

- ప్రభుత్వ ధరలకే బియ్యం విక్రయించాలి: డీసీఎస్ఓ నిత్యానంద్

మెదక్, నవంబర్ 3:,(సమయం న్యూస్)

ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యం విక్రయించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్ వ్యాపారులను హెచ్చరించారు. మెదక్ పట్టణంలోని పలు సూపర్ మార్కెట్లు, బియ్యం దుకాణాల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.బీపీటీ/కేఎన్ఎం రూ.66, ఆర్ఎన్ఆర్/తెలంగాణ సోనా రూ.74, హెచ్ఎంటీ/జేఎస్ఆర్ రూ.79 చొప్పున గరిష్ట ధరలను నిర్ణయించినట్లు తెలిపారు. అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




విద్యార్థులకు సరిపడా నాణ్యమైన భోజనము

- అందించాలని జిల్లా మైనారిటీ అధికారి ఎంప రషీద్ ఆదేశించారు.

నారాయణపేట, నవంబర్,03(సమయం న్యూస్)

తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్ సొసైటీ బాలుర గురుకుల నారాయణపేట పాఠశాలను జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఆదేశాల మేరకు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు రిజిస్టర్ పరిశీలించారు. విద్యార్థులకు అందించే ఆహారం సరుకులు స్టాక్ రిజిస్టర్ ద్వారా ఉన్న స్టాకును తనిఖీ చేసి నాణ్యమైన సరుకులు కొనుగోలు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు విద్యను అందించే విధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం మైనారిటీ విద్యార్థులకు పెద్దపీట వేసిందని వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కేన్సర్ వైద్య సేవలపై ఆరోగ్యశాఖ మంత్రి సమీక్ష

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో కేన్సర్ వైద్య సేవలపై మంత్రి సమీక్ష

హైదరాబాద్, నవంబర్ 3:,(సమయం న్యూస్,)

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కేన్సర్ రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. ఎంఎన్జే కేన్సర్ ఆసుపత్రి, నిమ్స్లో కేన్సర్ రోగులకు అందిస్తున్న చికిత్స, వైద్య సదుపాయాలపై అధికారులు మంత్రికి వివరించారు.జిల్లాల్లో ఏర్పాటు చేసిన కీమోథెరపీ కేంద్రాల పనితీరు, రోగులకు అందుతున్న సేవలపై మంత్రి ఆరా తీశారు. కేన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపు కోసం స్క్రీనింగ్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇటీవల కేన్సర్ను నోటిఫయబుల్ వ్యాధిగా ప్రకటించిన ప్రభుత్వం, కేన్సర్ రిజిస్ట్రీతో పాటు ప్రత్యేక పోర్టల్ను ప్రారంభించింది. కేన్సర్ కేసుల నమోదు, పర్యవేక్షణ, చికిత్సా సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు.సమావేశంలో ప్రభుత్వ సలహాదారు, కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గ్రామాలకు ఆర్టీసీ సేవలను అందిస్తాం

రాయపోల్. నవంబర్ 03.

రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ ఆర్టీసీ సేవలు లేకపోవడంతో ప్రజలకు విద్యార్థులకు ప్రయాణికులకు ఇబ్బందిగా ఉందని ఇటీవల జరిగిన రాయపోలు మండల పరిషత్ సమీక్ష సమావేశంలో పలు గ్రామాల సర్పంచులు ఆర్టీసీ అధికారులకు వినతి పత్రం అందించారు. తక్షణమే స్పందించిన ఆర్టీసీ అధికారులు బస్సు కోసం ఆర్టీసీ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం రోజు తక్షణమే స్పందించినా సిద్దిపేట బస్సు డిపో దుబ్బాక డిపోలకు చెందిన అధికారులు వచ్చి మంతురు . అనజీపూర్ .రయపోల్ నుండి గజ్వేల్ రూట్ ను పరిశీలించిన అధికారులు సానుకూలంగా స్పందించడం జరిగింది ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన వివిధ గ్రామాల సర్పంచ్ లుఈ కార్యక్రమం లో మంతురు గ్రామ సర్పంచ్ పర్వేజ్ ఉపసర్పంచ్ సంతోష్ అన జీపూర్ ఉపసర్పంచ్ల లువురు గ్రామస్థులు. పాల్గొన్నారు.



శాసనమండలి ప్రాంగణ అభివృద్ధిపై సీఎస్ సంజయ్ జాజు పరిశీలన

హైదరాబాద్, నవంబర్ 3(సమయం న్యూస్)

శాసనమండలి ప్రాంగణంలో ప్రతిపాదించిన అభివృద్ధి, సుందరీకరణ పనులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాతో కలిసి పరిశీలించారు. అనుబంధ భవనం, పరిపాలనా భవనం, కార్యాలయాలు, క్రీడా మైదానం, పార్కింగ్ తదితర ప్రతిపాదనలను సమీక్షించారు. పర్యావరణహిత, సుస్థిర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఉన్న పచ్చదనాన్ని కాపాడుతూ చారిత్రక భవనం వారసత్వ విలువను పరిరక్షించాలని సీఎస్ సూచించారు.



వచ్చే బోనాల నాటికి ఇందిరమ్మ టవర్స్ పూర్తి

హైదరాబాద్, నవంబర్ 3(సమయం న్యూస్)

వచ్చే బోనాల నాటికి ఇందిరమ్మ టవర్స్లో గృహ ప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.గోషామహల్, ముషీరాబాద్, ఎల్బీనగర్, చంద్రాయణ గుట్ట నియోజకవర్గాల్లో 1,920 ఇళ్లకు ఈలాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. పేదల కోసం మరిన్ని ప్రభుత్వ భూములను గుర్తించి ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని మంత్రి తెలిపారు.రూ.40-50 లక్షల విలువైన ఇళ్లను రూ.6 లక్షలకే అందించడంతో పాటు రిజిస్ట్రేషన్ ఉచితంగా చేస్తామని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ విపి గౌతం తెలిపారు.నవంబర్ 4న 14 నియోజకవర్గాల్లో సుమారు 1,700 ఖాళీ ఇళ్లకు మాప్అప్ లాటరీ నిర్వహించనున్నారు.



డిసెంబర్ 15 నుంచి ఆశాల నిరవధిక సమ్మె

- రూ.18,000 ఫిక్స్డ్ వేతనం, సామాజిక భద్రతకు డిమాండ్

మల్కాజ్గిరి సమయంమల్కాజ్గిరి సమయం



ప్రజారోగ్య రంగంలో వెన్నెముకగా నిలుస్తున్న ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) సహాయ కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కరించకపోతే డిసెంబర్ 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని స్పష్టం చేశారు.ఈ మేరకు పారిశ్రామిక వివాదాల చట్టం 1947 సెక్షన్ 22(1) ప్రకారం కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్కు సమ్మె నోటీసు ఇచ్చినట్లు తెలిపారు.రెండు దశాబ్దాల సేవ...అయినా దక్కని గుర్తింపురాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు 20 ఏళ్లుగా పల్లెలు, పట్టణాల్లో విరామం లేకుండా సేవలందిస్తున్నారని ఆమె అన్నారు.గర్భిణులకు వైద్య సేవలు, అనుపత్రుల్లో ప్రసవాలు, తల్లీబిడ్డల ఆరోగ్యం, టీకాలు, కుటుంబ నియంత్రణతో పాటు డెంగ్యూ, మలేరియా, కరోనా వంటి వ్యాధుల నివారణలోనూ వీరి పాత్ర కీలకమని గుర్తుచేశారు.హామీలు కాగితాలకే పరిమితం ప్రతిపక్షంలో ఉండగా ఆశాల పోరాటాలకు మద్దతు పలికిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరించి వేతనాలు పెంచుతామని మేనిఫెస్టోలో పేర్కొందని ఆమె తెలిపారు. 2024 ఫిబ్రవరి 9, జులై 30, డిసెంబర్ 10 తేదీల్లో కోఠి కమిషనర్ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనల సమయంలో రూ.18,000 ఫిక్స్డ్ వేతనం ఫైల్ ప్రాసెస్లో ఉందని, ఇతర సౌకర్యాలు కూడా కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారని చెప్పారు. అయితే ఇప్పటివరకు ఒక్క హామీ కూడా అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఆశా వర్కర్ల ప్రధాన డిమాండ్లు నెలకు రూ.18,000 ఫిక్స్డ్ వేతనం; పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రతరూ.50 లక్షల ఇన్సూరెన్స్; రూ.50,000 మట్టి ఖర్చులురిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.5 లక్షలు; పారితోషికంలో సగం పెన్షన్ఆదివారాలు, పండుగ సెలవులతో పాటు ఏడాదికి 20 క్యాజువల్ సెలవులు; 6 నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు; ప్రసూతి సెలవులుANM, GNM శిక్షణ పొందిన ఆశాలకు పదోన్నతులు; టార్గెట్లు, స్పుటమ్ డబ్బాల మోత వంటి పనుల రద్దు 2వ పీఆర్సీలో కనీస వేతనం రూ.30,000; ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన 2 డీఏలు ఆశాలకూ వర్తింపుఅన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుసమ్మె పరిస్థితులు తలెత్తకముందే ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని రేవతి కళ్యాణి కోరారు. ఆశా వర్కర్లంతా ఐక్యంగా నిలిచి సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రైతు మేళా ను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయం తో పని చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రియాంక.

నారాయణపేట, నవంబర్,03(సమయం న్యూస్)



కొడంగల్ నియోజకవర్గంలోని హకీం పేటలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న రైతు మేళా కార్యక్రమానికి నారాయణపేట జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో రైతులను తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు.ఈ రైతు మేళా కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి హాజరుకానున్ననేపథ్యంలో జిల్లా నుంచి రైతులను తరలించేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని సూచించారు.ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అధికారులతో కలెక్టర్ ప్రియాంక సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రైతు మేళాకు రైతులను తరలించేందుకు మండలాల వారీగా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని, ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను సమన్వయ బాధ్యతలు అప్పగించాలని సూచించారు. రైతులకు రవాణా సౌకర్యం, ప్రయాణ ఏర్పాట్లు, భోజన వసతి తదితర అంశాలపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.రైతు మేళాకు వెళ్లే బస్సుల వివరాలు, బయలుదేరే సమయాలు, నిర్ణయించిన పికప్ పాయింట్లు, రైతుల సంఖ్య తదితర వివరాలను సంబంధిత యాప్లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. లైజనింగ్ అధికారులు బస్సుల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ బస్సులు బయలుదేరినప్పటి నుంచి గమ్యస్థానానికి చేరుకునే వరకు పర్యవేక్షించాలన్నారు.జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ పాయింట్ ఏర్పాటు చేసి, మూడు రోజుల పాటు అధికారుల బృందాలు అందుబాటులో ఉండాలని సూచించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రైతు మేళా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను,ట్రైనీ కలెక్టర్ ఫణి కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, ప్రజారోగ్య శాఖ ఎస్ ఈ విజయ్ భాస్కర్, డిఆర్డిఓ వెంకట్ రాములు, జెడ్పీ డిప్యూటీ సీ ఈ వో సుజాత, ఆర్టీవో మున్నీ, ఆర్ అండ్ బీ ఈ ఈ వెంకట రమణయ్య, పీ ఆర్ ఈ ఈ అశోక్ కుమార్, హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, డీఈఓ డీ ఎం వో బాలా మణి, కోస్గి మున్సిపల్ కమిషనర్ నాగరాజు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదలపై నివారణ,అగ్నిమాపక భద్రతపై నవీన ఆదర్శ ప్లే &హైస్కూల్ లో అవగాహన

కొడంగల్ మున్సిపల్, నవంబర్,03(సమయం న్యూస్)



కొడంగల్ పట్టణ కేంద్రంలోని నవీన ఆదర్శ ప్లే & హైస్కూల్,లో దీపావళి పండుగను పురస్కరించుకొని అగ్నిప్రమాదాల నివారణ మరియు అగ్నిమాపక భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కోడంగల్ అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి, విద్యార్థులకు దీపావళి పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాణసంచా వినియోగంలో పాటించాల్సిన భద్రతా నియమాలు,అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు మరియు ప్రమాదాల నివారణకు సంబంధించిన విలువైన సూచనలు అందించారు.ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారులు మరియు సిబ్బంది విద్యార్థులకు అగ్నిప్రమాదాల పట్ల అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని సూచించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే దీపావళి వేడుకలు జరుపుకోవాలని, ప్రమాదకరమైన బాణసంచాకు దూరంగా ఉండాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డా. డి.వి. నరేష్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. డి.వి. నరేష్ రాజు మాట్లాడుతూ, అగ్నిమాపక శాఖ అందించిన సూచనలు విద్యార్థులకే కాకుండా ప్రతి కుటుంబానికి,సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ, సురక్షితమైన మరియు ఆనందకరమైన దీపావళిని జరుపుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కోడంగల్ అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్, కార్యక్రమంలో పాల్గొన్న అగ్నిమాపక శాఖ సిబ్బంది అందరికీ పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా ప్రారంభమైన 5వ తెలంగాణ పోలీస్ క్రీడా పోటీలు

- విధి ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు దోహదం...ఐజీ గజారావు భూపాల్
- పోలీసు క్రీడాకారుల్లో ఉత్సాహం నింపిన ప్రారంభోత్సవం... సీపీ ఎన్.శ్వేత
- పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా 1,458 మంది క్రీడాకారులు

హనుమకొండ, నవంబరు 3 (సమయం న్యూస్)



విధి నిర్వహణలో ఎదురయ్యే పని ఒత్తిడిని అధిగమించడంతోపాటు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఐజీ గజారావు భూపాల్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్-2026 (క్లస్టర్-డి) పోటీలను మంగళవారం హనుమకొండలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో ఆయన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతతో కలిసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ విధి నిర్వహణతోపాటు క్రీడల్లోనూ పోలీసు సిబ్బంది ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. క్రీడలు క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. పోటీల నిర్వహణకు సమర్థవంతమైన ఏర్పాట్లు చేసిన పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, క్రీడల ఇన్చార్జి అధికారులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజులపాటు జవహర్లాల్ నెహ్రూ స్టేడియం, కిట్స్ కళాశాల, భీమారంలోని ఎస్వీఎస్ కళాశాల మైదానాల్లో వివిధ క్రీడా పోటీలు జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ యూనిట్లకు చెందిన సుమారు 1,458 మంది పోలీసు క్రీడాకారులు ఇందులో పాల్గొంటున్నారు.ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీలు రాయల ప్రభాకర్ రావు, బాలస్వామి, ఏసీపీలు నర్సింహారావు, సదయ్య, మధుసూదన్, జానీ నర్సింహులు, ఏఆర్ అదనపు డీసీపీలు సురేష్, శ్రీనివాస్, నాగయ్య, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాల నిధులను సమర్థవంతంగా వినియోగించాలి

- కేంద్ర నిధులను పూర్తిస్థాయిలో రాబట్టుకోవాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, నవంబర్ 3(సమయం న్యూస్):



కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి, కేంద్రం నుంచి రావాల్సిన నిధులను పూర్తిస్థాయిలో రాబట్టుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల లక్ష్యాలు నెరవేరేలా చర్యలు తీసుకుని, ప్రజలకు ఆశించిన ప్రయోజనాలు అందించాలని సూచించారు.సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో కేంద్ర పథకాల అమలు, నిధుల కేటాయింపులు, ఖర్చులు, పెండింగ్ బిల్లులు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై ఆయన సమీక్ష నిర్వహించారు. కేంద్ర శాఖలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ సకాలంలో ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు.నీటిపారుదల, పట్టణాభివృద్ధి, రవాణా, వ్యవసాయం, వైద్య ఆరోగ్య శాఖలు కేంద్ర పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మూలధన పెట్టుబడుల కోసం కేంద్రం అందించే ప్రత్యేక సహాయ పథకం వంటి కార్యక్రమాలను గరిష్ఠంగా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాలకు రాష్ట్ర వాటా నిధులను సకాలంలో విడుదల చేస్తున్నామని తెలిపారు. పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తూ బిల్లులను క్రమశిక్షణతో క్లియర్ చేస్తున్నామని వివరించారు.ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ వివిధ శాఖల్లో అమలవుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాల పురోగతి, నిధుల వినియోగం, ప్రస్తుత పరిస్థితిని ఉప ముఖ్యమంత్రికి వివరించారు.